జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 22, ఆగస్టు 2024

## డిజిటల్ మీడియాలో..

# జయహో "మహానాడు"







## 1,51,838 మంది మహానాడు

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్

మార్చి 1న ప్రారంభమైన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

## మా అభిమాన పాఠకుల
## అనుబంధానికి వందనం



సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారధ్యంలో



బోడేపూడి సుబ్బారావు (BSR)
సారధ్యంలో



జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 22, ఆగస్టు 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచండి

- కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సుల కొనుగోలు
- మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు
- నారా చంద్రబాబు నాయుడు



అమరావతి,మహానాడు:
రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంచే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డీజిల్ బస్సులు, ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుతో పాటు నిర్వహణ, మైలేజ్ లో ఉన్న వ్యత్యాసాన్ని లెక్కించాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీలో కూడా ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచేలా చర్యలు తీసుకోవా లన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల కోనుగోలులో కేంద్రం ఇస్తున్న సబ్సీడీలను వినియోగించుకుని 1253 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. మిగతా.. 2లో

# జనం సొమ్ముతో జగన్ జల్సా

- ప్రైవేటు సెక్యూరిటీకీ జనం సొమ్మేనా?
- నెలకు ఐదున్నర లక్షలు ప్రైవేటు సెక్యూరిటీ పాలు
- త్రినేత్ర సెక్యూరిటీకి 26 లక్షల సమర్పయామి
- ఎల్ఎస్ఈ-డీ, టీవీలకు 5 లక్షల 20 వేల రూపాయలట
- ఇంట్లో ఎలుకలు పట్టేందుకు 1.36 కోట్లా?
- ఎగ్ పఫ్‌లకు 3.6 కోట్లు మాత్రమేనట
- సజ్జల ఇంట్లో ఫర్నీచర్, టీ కప్పులకు నాలుగున్నర లక్షలు
- దాడిశెట్టి రాజా, పిన్నెల్లి, బూడి ముత్యాలనాయుడు, జగన్ దోస్తు శ్రీకాంత్ రెడ్డి ఇంటి అద్దెలూ ఖజానాకే ఆముదం
- సర్కారు సొమ్ముతో తాడేపల్లి, లోటస్ పాండ్ ప్యాలెస్లకు కోట్ల సున్నం
- 'మహానాడు' ఎగ్ పఫ్ ఫలహారం వార్తతో వైసీపీలో కలవరం
- ఎగ్ పఫ్ కోసం ముచ్చటగా మూడున్నర కోట్లు మింగేసిన జగన్ క్యాంపు ఆఫీసు
- ఆ కథనంపై వైసీపీ సోషల్ మీడియాలో అసహనం
- 'మహానాడు'పై వైకాపీయుల విమర్శల దాడి
- ఇప్పుడు జగన్ జమానా నాటి 'దయ్యపుతిండి' నిజమేనంటున్న జీఓలు
- మరి ఇప్పుడు జగనేయుల జవాబేమిటో?


మహానాడు
కక్కుర్తి విలాస్ కాఫీక్లబ్!




(మార్తి సుబ్రహ్మణ్యం)

ఒక సద్దాం హుస్సేన్.. ఇంకో కిమ్.. మరో అమెరికా ప్రెసిడెంట్ల రక్షణకు వందల కోట్ల రూపాయలు ఖర్చవుందని వినేవాళ్లం. అప్పట్లో మారువేషాల్లో.. తన డూపులను పెట్టి తిరిగే సద్దాం హుస్సేన్ రక్షణకు వందల కోట్లు ఖర్చయ్యేదట. ఇక కిమ్, అమెరికా, రష్యా, ఇజ్రాయిల్ చీఫ్ రక్షణ ఖర్చు ఆ పైమాటే. ఎందుకంటే వారిది అంతర్జాతీయ స్థాయి. వివిధ దేశాల శత్రువులు, స్వదేశ-విదేశాల్లోని టెర్రరిస్టులతో ప్రాణ హాని ఉంటుంది కాబట్టి, ఆ పాటి రక్షణ ఉండటంలో పెద్ద విశేషమేమీ లేదు.


కానీ మన దేశంలో ఒక రాష్ట్రానికి సీఎం చేసిన వ్యక్తికి, అందునా బయట కూడా కాలుబెట్టని సీఎంకు సైతం వారి లెవల్లో సెక్యూరిటీ ఉంటుందని.. అందుకోసం కోట్లాది రూపాయల జనం సొమ్మును, స్ట్రాలతో జగనన్న జలగల మాదిరిగా పీల్చేశారంటే నమ్ముతారా? ఎస్. నమ్మి తీరాలి. ఎందుకంటే అవి నిఖార్సయిన నిజాలేనని సర్కారు ఉత్తర్వులే ఘోషిస్తున్నాయి కాబట్టి!

జగనన్న ఐదేళ్ల జమానాలో క్యాంపు ఆఫీసు.. కేవలం మూడున్నర కోట్ల ఎగ్ పప్ఫ ఆరగించిందన్న 'మహానాడు' కథనం వైకాపాను కుదిపివేసింది. 'కక్కుర్తి విలాస్ కాఫీ క్లబ్' శీర్షికతో, 'మహానాడు' ఈ- పేపర్లో వెలువడ్డ ఆ కథనంలో.. జగనేయులు రోజుకు, వారానికి, నెలకు, ఏడాదికి ఎగ్ పప్ఫ ఏ స్థాయిలో లాగించేశారన్న వివరాలు వెల్లడించింది. నిజానికి అవన్నీ సోషల్ మీయాలో చక్కర్లు మిగతా.. 2లో

- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఘోర ప్రమాదం
- ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 17 మంది మృతి
- ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి
- తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం



## అచ్యుతాపురంలో ఫార్మా కంపెనీలో
# ఘోర అగ్నిప్రమాదం



అనకాపల్లి, మహానాడు:
అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ఘోర ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలిన ఘటనలో ఇప్పటివరకు 17 మంది మృతి చెందారు. మరో 60 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమ భవనం దెబ్బతింది.

శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉంటారని భావించి.. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో 3 ఎన్డీఆర్ఎఫ్ బృందాల రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. శిథిలాల తొలగింపు కోసం భారీ క్రేన్లను అధికారులు తెప్పించారు. అంబులెన్సుల్లో మృతదేహాలు, బాధితులను తరలిస్తున్నారు. శిథిలాల తొలగింపు పూర్తయితే కానీ మృతులు, క్షతగాత్రుల సంఖ్య తేల్చలేని పరిస్థితిలో అధికారులు ఉందన్నారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీలో వందల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది పని చేస్తున్నారు. భోజన విరామ సమయంలో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ అలుముకుని ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగు తీశారు. భారీ శబ్ధంతో మిగతా.. 2లో



## ఓటుకు నోటు కేసులో
# బాబుకు భారీ ఊరట

- ఆళ్ల పిటిషన్లను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- రాజకీయ కక్ష సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దని హెచ్చరించిన ధర్మాసనం
- ఆళ్లపై ధర్మాసనం ఆగ్రహం

ఢిల్లీ,మహానాడు:
ఓటుకు నోటు కేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబుని నిందితుడిగా చేర్చాలని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం మిగతా.. 2లో

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూ సేకరణ

- రెండు పార్ట్‌ల్లో ప్రగతిపై రోజువారీ సమీక్ష చేయాలి
- భవిష్యత్ అవసరాలకు తగినట్లు దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో మార్పులకు సూచన
- భూ సేకరణలో పారదర్శకంగా వ్యవహరించాలి...
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,మహానాడు:
రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు... పనుల పురోగతి ఏమిటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారం తనకు అందజేయాలన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజువారీగా ఏం చేశారు. ఏం పురోగతి సాధించారు, దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం, ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతి రోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. మిగతా.. 2లో

## జరిగింది రుణమాఫీ కాదు.. పెట్టింది రైతులకు టోపీ

- రవ్వంత రుణమాఫీ చేసి కొండంత డబ్బా కొట్టుకున్న ముఖ్యమంత్రి
- రైతుల మీద నాన్ బెయిలబుల్ కేసులు
- రెండు లక్షల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి చెప్పున్నారు
- సాంకేతిక అంశాల ఆధారంగా రుణమాఫీ జరగలేదని ఉత్తంకుమార్ రెడ్డి చెప్పున్నారు
- ఈ ప్రభుత్వానికి రుణమాఫీ పైన స్పష్టత ఉందా? లేదా?
- ముఖ్యమంత్రి, మంత్రులు రకరకాలుగా మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించిన కేటీఆర్
- నాకు ఫామ్ హౌస్ లేదు. .నా ఫ్రెండ్ ఫామ్ హౌస్‌ను లీజు తీసుకున్నా
- ఒకవేళ ఆ ఫామ్ హౌస్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చేయండి :తెలంగాణ భవన్‌లో కేటీఆర్

10 లో





07
గతంలో సీఎంను కలవాలంటే గగనం


03
కన్నయ్యనాయుడుని సన్మానించిన సీఎం చంద్రబాబు


04
వైసీపీ రౌడీల బారి నుంచి రక్షించండి!


06
రుణమాఫీపై అవగాహన లేనివారు అవాకులు చవాకులు పేలుతున్నారు..



# పోలీసింగ్‌లో స్పష్టమైన మార్పు కనిపించాలి

- నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం కల్పించేలా పోలీసు శాఖ పని చేయాలి
- శాంతి భద్రతల విషయంలో రాజీలేదు....పోలీసు సిబ్బందిలో అలసత్వాన్ని సహించేది లేదు
- ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు కావాలి
- విచారణలో పోలీసులు ఆలస్యం చేస్తే నేనే ఘటనా స్థలానికి వెళతా
- డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠినంగా వ్యవహరించండి.... గంజాయి, డ్రగ్స్ తరిమేయండి
- ఏపీ పోలీసు శాఖ ప్రతిష్ట మళ్లీ నిలబెడదాం... ప్రజల భద్రతకు భరోసా ఇద్దాం
- హెూం శాఖలో రివ్యూలో నారా చంద్రబాబు నాయుడు
- 2014-19 పోల్చితే 2019-24లో క్రైం రేట్ 46 శాతం పెరిగిందన్న అధికారులు
- పోలీసు శాఖలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు నిధుల విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశం

అమరావతి,మహానాడు:
రాష్ట్రంలో పోలీసింగ్‌లో స్పష్టమైన మార్పు కనిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నేరం చేస్తే శిక్ష తప్పదు అనే భయం కనిపించేలా పోలీసు శాఖ పనిచేయాలని సీఎం అన్నారు. నేరం జరిగిన తరువాత నేరస్తులను పట్టుకోవడం, శిక్షించడం ఒక ఎత్తు అయితే... అసలు నేరం చేయాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాలని సీఎం అన్నారు. ప్రజల భద్రతకు ఒక భరోసా ఇచ్చేలా పోలీసు శాఖ పనిచేయాలని.... పూర్తి స్థాయి శాంతి భద్రతలతో మళ్లీ ప్రశాంతమైన రాష్ట్రంగా ఏపీ కనిపించాలని సీఎం అన్నారు.

రాజకీయ ముసుగులో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని సీఎం అన్నారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో, నేరాల విచారణ, నేరస్తులకు శిక్షల విషయంలో అధికారులు ఫలితాలు కనిపించేలా పనిచేయాలని సూచించారు. మిగతా.. 10లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 22, ఆగస్టు 2024


# అచ్యుతాపురంలో ఫార్మా కంపెనీలో ఘోర అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి..)

సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మొత్తం 12 అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపుచేశాయి.

**బాధితుల పరామర్శకు నేడు అచ్యుతాపురానికి సీఎం చంద్రబాబు నాయుడు**

సీఎం చంద్రబాబు నాయుడు రేపు అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం వెళ్లనున్నారు. ఫార్మా సెజ్ లోని ఎసెన్షియా అనే కంపెనీలో రియాక్టర్ పేలి మృతి చెందిన వారి కుటుంబాలను,



ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించనున్నారు. ప్రమాదం జరిగిన ఘటనా ప్రాంతాన్ని ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. ఘటనపై ముఖ్యమంత్రి బుధవారం నిరంతరం సమీక్ష చేశారు. సహాయక చర్యలపై జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడారు. హెల్త్ సెక్రటరీతో మాట్లాడి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎం సూచించారు. అవసరమైతే క్షతగాత్రులను విశాఖ లేదా హైదరాబాద్ తరలించేందుకు ఎయిర్ అంబులెన్సులను వినియోగించాలని ఆదేశించారు. కార్మికుల ప్రాణాలు కాపాడడానికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విచారణ ఆధారంగా.. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించారు.

**ఘటనపై హోం మంత్రి అనిత ఆరా**

ఫార్మా కంపెనీ ప్రమాదంపై హోం మంత్రి అనిత ఆరా తీశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం



అందించాలని ఆదేశించారు.

**బాధితులకు అండగా నిలవాలి: మాజీ సీఎం జగన్**

ఫార్మాకంపెనీలో రియాక్టర్ పేలుడు ప్రమాదంపై స్థానిక నాయకులతో మాట్లాడి ఈ ఘటనపై మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా



చర్యలు తీసు కోవాలన్నారు. ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు తన సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నా నన్నారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్జీ పాలిమర్స్ బాధితులను ఆదుకున్న తరహాలోనే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1కోటి చొప్పున పరిహారం అందించాలని శ్రీ వైయస్.జగన్ డిమాండ్ చేశారు. గాయపడి చికిత్స పొందుతున్న వారికి ఉచితంగా ఉత్తమ వైద్యం అందించాలని, వారు కోలుకునేంతవరకూ ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వాన్ని గట్టిగా కోరారు. ఫార్మాకంపెనీలో రియాక్టర్ ప్రమాదంపై ఉన్నత స్థాయి విచారణ జరిపి మళ్లీ అలాంటి ఘటనలు జరక్కుండా గట్టిచర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

## అచ్యుతాపురం సెజ్‌లో ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది: మంత్రి లోకేష్

**అమరావతి, మహానాడు:** అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురం సెజ్ లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ రియాక్టర్ పేలి పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ప్రాణాలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి ఇప్పటికే యంత్రాంగాన్ని ఆదేశించారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ఓటుకు నోటు కేసులో బాబుకు భారీ ఊరట

(మొదటిపేజీ తరువాయి..)

డిస్మిస్ చేసింది.

దాఖలైన రెండు పిటిషన్లను జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం విచారించింది. రాజకీయ కక్ష సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దంటూ పిటిషనర్ రామకృష్ణారెడ్డిని, జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం మందలించింది. ఆ మేరకు ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది.

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టులను వాడుకోవద్దని పిటిషనర్ రామకృష్ణారెడ్డిని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఆధార రహిత అంశాలను తీసుకువచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దంటూ తీవ్రంగా స్పందించింది.

పిటిషనర్ రాజకీయ నేపథ్యంపై ధర్మాసనం ఆరా తీసింది. ఈ సందర్భంగా పిటిషనర్ 2014 నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారంటూ చంద్రబాబు తరఫు న్యాయవాదులు సుప్రీం కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ ప్రతిపక్షంలో ఉందని, సీఎం తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టుకు తెలిపారు.

కావాలంటే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి తప్ప రాజకీయ కక్షల కోసం ధర్మాసనం వద్దకు రావొద్దంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటుకు నోటు వ్యవహారంపై సుప్రీంకోర్టులో వేరే కేసులు కూడా ఉన్నాయని రామకృష్ణారెడ్డి తరఫు న్యాయవాది ధర్మాసనం ఎదుట ఓ జాబితా పెట్టారు.

ఆ కేసులకు, ఇప్పుడు వాదనలు జరుగుతున్న కేసులకు సంబంధం లేదన్న చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా పేర్కొన్నారు. కేసుల జాబితా చూశాక పిటిషనర్ రామకృష్ణారెడ్డిపై ధర్మాసనం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలు కనపడటం లేదని తెలిపింది. ఆధార రహిత అంశాలను తీసుకువచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దంటూ తీవ్రంగా స్పందించింది.

## ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచండి

(మొదటిపేజీ తరువాయి..)

దూర ప్రాంతాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడిపితే ఛార్జింగ్ విషయంలో తలెత్తే సమస్యలకు పరిష్కారాలు ఆలోచించాలని అధికారులకు సూచించారు. బస్సులు అద్దెకు తీసుకునే విధానం వల్ల లాభనష్టాలు, సొంతంగా బస్సులు కొనుగోలు చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై పూర్తిస్థాయి నివేదికతో రావాలని సీఎం సూచించారు. సీఎం మాట్లాడుతూ....గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు తగ్గించిందని, తిరిగి సర్వీసుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. క్రమంగా డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సుల వైపు ఆర్టీసీ వెళ్లాలని సూచించారు. ఆర్టీసీ కార్గో ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. ఆన్ లైన్ విధానాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు ఇవ్వాలన్నారు.

ఇప్పటికే ప్రతిపాదించిన 1489 డీజిల్ బస్సులను కూడా సమకూర్చుకోవాలని సీఎం అన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది తప్ప, ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. ప్రమాదాల నివారణకు ఎస్పీ, కలెక్టర్, రోడ్ సేఫ్టీ అధికారులు సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను తొలగించాలని ఆదేశించారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ను ప్రతి జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్నారు. వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ కార్డు అందించాలన్నారు.

**ఉచిత బస్సు పథకంపై సమీక్ష:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకంపై అధికారులతో సీఎం చర్చించారు. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఢిల్లీ, కర్నాటక, పంజాబ్, తమిళనాడుతో పాటు ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై అధికారులు పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలన్నారు. ఈ మేరకు అధికారుల బృందం ఆయా రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. రెండు రోజులు ఆలస్యమైనా లోపాలకు తావు లేకుండా, మహిళలు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేలా విధానాలు రూపొందించాలన్నారు.

# జనం సొమ్ముతో జగన్ జల్సా

(మొదటిపేజీ తరువాయి..)

కొడుతున్న కథనాలే.

అయితే వైసీపీ సోషల్ మీడియా సైన్యం, 'మహానాడు' కథనంపై బురద చల్లడం ప్రారంభించింది. గతంలో బాబు హయాంలో ఎవరూ తినలేదా? అన్న ప్రచారానికి తెరలేపింది. జర్నలిజంలో నైతిక విలువలు లేకుండా పోతున్నాయని

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Home Department – Budget Estimates 2020-21 (Vote on Account)- Intelligence – Sanction of **Rs.25,92,000/-** as additional funds towards payment of charges to Trinetra Security & Detective Services for providing security personnel at Chief Minister's Camp Office, Tadepalli - Administrative sanction – Accorded.

HOME (BUDGET) DEPARTMENT

**G.O.RT.No. 730** **Dated: 30-07-2020**
**Read the following:-**

1. From Additional Secretary to Chief Minister, CMP No.501/Addl.Secy/2019, dated 26.09.2019.
2. From the Inspector General of Police, Intelligence, AP., I.D.No.6/SW6/2020, dated 10.02.2020.
3. G.O.Rt.No.1539, Finance (FMU-H&C) Department, dated 03.06.2020.

***

**ORDER:**

In the circumstance stated by the Inspector General of Police, Intelligence, Andhra Pradesh in reference second read above and in pursuance of the Budget Release Order issued by the Finance (FMU-H&C) Department in reference third read above, Government, **hereby accord Administrative sanction for an amount of Rs.25,92,000/- (Rupees Twenty Five Lakh Ninety Two Thousand only)** under the Head of Account 2055-00-101-00-05-300/304 as additional funds towards payment of charges to Trinetra Security & Detective Services for providing security personnel at Chief Minister's Camp Office, Tadepalli, Andhra Pradesh in relaxation of treasury control and quarterly regulation orders pending provision of funds by obtaining supplementary grants at an appropriate time during the Financial Year 2020-21.

2. The Inspector General of Police, Intelligence, Andhra Pradesh shall take necessary action, accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

**KUMAR VISHWAJEET**
**PRINCIPAL SECRETARY TO GOVERNMENT**

To
The Inspector General of Police, Intelligence, Andhra Pradesh (w.e)
The Director of Treasuries & Accounts, Ibrahimpatnam.
The Director of Works & Accounts, Ibrahimpatnam.
The Pay & Accounts Office, Ibrahimpratnam
The Accountant General, Hyderabad, Andhra Pradesh.

గుండెలు బాదుకుంది. ఫర్వాలేదు.. మేము జర్నలిజంలో నైతిక విలువల గురించి నేర్చుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం.

మరి జగన్, భారతీరెడ్డి, సజ్జల, కొమ్మినేని, దేవులపల్లి అమర్.. ఇంకా జగన్ సర్కారులో పదవులు వెలగబెట్టిన వెలగబెడుతున్న తాజా–మాజీ 'జనరలిస్టు'లు వచ్చి.. 'జనరలిజం–నైతిక విలువల' అంశంపై, జాతినుద్దేశించి ప్రసంగిస్తారా అన్నదే ప్రశ్న. సర్కారు సొమ్మును, సొంత మీడియాలో పనిచేసే వారికి ఎన్ని కోట్లు ఫలహారంగా పెట్టారో సెలవిచ్చే ధైర్యం ఉందా? తాడేపల్లి ప్యాలెసులో పనిచేసే వారికి ఎన్ని కార్పొరేషన్ల నుంచి జీతాలు ఇప్పించారో చెప్పే దమ్ముందా?

ఇప్పటికే జగనన్న ఇంటికి తగలబెట్టిన జనం సొమ్మెంతో, సర్కారు ఉత్తర్వులే బయట పెట్టాయి. ఇప్పటిదాకా సర్కారు ఫర్నీచరును సర్కారుకు స్వాధీనం చేయని సిగ్గుమాలిన–కక్కుర్తితనానికి జవాబు ఇవ్వడం బదులు, వాటిపై జనాభిప్రాయాన్ని బయటపెడుతున్న 'మహానాడు'పై ఎదురుదాడి చేయడం.. పిరికితనమే కాదు. సిగ్గుమాలిన వ్యవహారమే. 'విడిచేసింది వీధికి పెద్ద' అన్నది చింతామణిలో సుబ్బిశెట్టి చెప్పిన డైలాగు. వైకాపా సోషల్ మీడియా విడిచేసినతనం కూడా అంతే!

తన ముడ్డి కాకపోతే కాశీ దాకా దేకమన్నది మనం చిన్నప్పుడు విన్న ఓ సామెత. ఈ మధ్య కాలంలో పొట్టపగిలేలా తినిపో".. తిన్నోళ్లకు తిన్నంత పందెం కోడి.. తిన్నంత భోజనం.. వచ్చి తినిపో.. నాపొట్ట నా ఇష్టం... బకాసుర రెస్టారెంట్ పేర్లతో హోటళ్లు తెరవడం చూస్తున్నాం. బహుశా వీటికి జగన్ క్యాంపు ఆఫీసు మింగేసిన మూడున్నర కోట్ల ఎగ్ పఫ్ బిల్లు స్ఫూర్తి కావచ్చు. లేదా ఆ పేర్లే ఎగ్ పఫ్‌లా భోజనం చేయడానికి స్ఫూర్తిదాయకం కావచ్చు. ఇప్పుడు జగనన్న క్యాంపు ఆఫీసు తిన్న తిండి.. సెక్యూరిటీ.. ప్యాలెస్ సోకుల కోసం చేసిన ఖర్చులు చూస్తే బకాసురులు, అమెరికా అధ్యక్షులు కూడా కుళ్ళుకోక తప్పదు మరి.

పోనీ అప్పటికే ఉన్న 900 మంది పోలీసులతోపాటు.. ప్రైవేటు సెక్యూరిటీ కోసం తగలెట్టిన కోట్ల రూపాయలవల్ల, ఏమైనా ఫాయిదా ఉందా అంటే అదీ లేదు. రోజూ జనం మధ్య తిరిగే సీఎంలకయితే సెక్యూరిటీ గత్రాలు కావాలి.

కానీ కాలుబయటపెడితే ఆకాశంలో, రోడ్డుమీదకొస్తే పరదాలు కట్టుకునే భాగ్యానికి అన్నేసి వందలమందితో సెక్యూరిటీ ఎందుకు? పోనీ జగనన్న ఏమైనా తీవ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నాడా అంటే అదీ లేదు. ఆయన అజాతశత్రువు. ఆయనకు ఉన్నదంతా అక్కాచెల్లెమ్మలు, అవ్వాతాతలు, నా ఎస్సీలే, నా బీసీలే కదా? చివరాఖరకు దేవుడి గుడి సెట్టింగులు కూడా ఇంట్లోనే వేసుకునే బాపతుకు.. ఇద్దరు ఎస్పైలు, ఇద్దరు హోంగార్డు కూడా ఎక్కువే.

ఇక జగనన్న జమానాలో వివిధ సేవల కోసం నాకేసిన ప్రజాధనం జాబితా చూస్తే కళ్లుతిరిగి పడిపోకతప్పదు. ఇంటలిజన్స్ వింగ్ జగనన్నకు ప్రేమతో ఇచ్చిన ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలకు లక్షలు నాకేశారు. నాటి వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, జగన్ దోస్తు శ్రీకాంత్ రెడ్డి ఇంటి అద్దెలు కూడా ఖజానా నుంచే చెల్లించారంటే.. జగన్ జమానాలో మంది సొమ్మును ఎంత సమ్మగా జుర్రుకున్నారో అర్థమవుతుంది.

ఆ లెక్కలు ఇప్పుడు బయటకొచ్చాయి. అవేమిటో చూద్దాం.

**జీఓ నెంబర్ : 160**

- లోటస్ పాండ్‌లో ఉన్న జగన్ ఇంటికి సిసి కెమెరాల ఖర్చు : రూ.12.50 లక్షలు
- లోటస్ పాండ్‌లో బాత్ రూమ్ కోసం : రూ.12 లక్షలు

**జీఓ నెంబర్ : 279**

- తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ "వ్యూ కట్టర్" కోసం రూ:3.25 కోట్లు .

**జీవో నెంబర్ : 139**

- తాడేపల్లి ప్యాలెస్‌లో 24 గంటలు ఒక ఎలక్ట్రీషియన్ అందుబాటులో ఉండటానికి : రూ.8.50 లక్షలు
- మన ఇంట్లో పనికి అయితే, మహా అయితే, రోజుకి వెయ్యి తీసుకుంటున్నారు. ఇక్కడ లక్షలు ఇచ్చారు

**జీవో నెంబర్ : 146**

- తాడేపల్లి ప్యాలెస్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కోసం : రూ.97 లక్షలు
- తాడేపల్లి ప్యాలెస్‌లో సిసిటీవీ, సోలార్ ఫెన్సింగ్ కోసం రూ.1.25 కోట్లు
- తాడేపల్లి ప్యాలెస్‌లో ఏసి పెట్టటానికి రూ.80 లక్షలు
- 320 KVA DG సెట్ కోసం : రూ.39 లక్షలు
- తాడేపల్లి ప్యాలెస్‌లో లైట్‌లు పెట్టటానికి : రూ.11.50 లక్షలు
- ఏపీ సెక్రటేరియట్‌లో ఉన్న ఇన్వర్టర్ పీక్కుని వచ్చి, తాడేపల్లి ప్యాలెస్‌లో బిగించటానికి : రూ.11 లక్షలు

**జీవో నెంబర్ : 132**

- జగన్ ఇంటికి వెళ్ళే రోడ్డు వేయటానికి, 1 కిమీ రోడ్డుకి, : రూ.5 కోట్లు

**జీవో నెంబర్ : 308**

- జగన్ ఇంట్లో కుర్చీలు, టేబుల్స్ కొనటానికి రూ.39 లక్షలు

**జీవో నెంబర్ : 133**

- జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి హెలిప్యాడ్ దాకా వెళ్ళటానికి, రోడ్డుకి ఫెన్సింగ్ వేయటానికి రూ.40 లక్షలు
- తాడేపల్లి ప్యాలెస్‌లో శాశ్వత ఐరన్ ఫ్రేమ్స్ తో గ్రిల్స్ పెట్టటానికి : రూ.75 లక్షలు
- తాడేపల్లి ప్యాలెస్‌లో దొడ్లు కట్టటానికి : రూ.43.50 లక్షలు
- జగన్ ఇంటి చుట్టూ సెక్యూరిటీ పోస్ట్స్ , గేట్స్ శాస్వతంగా పెట్టటానికి రూ.31 లక్షలు

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Planning Department – Mana Palana – Mee Soochana - Commemorating one-year term in the office on 30th May, 2020, the Government decided to hold a week-long brainstorming sessions from 25th May, 2020 to 30th May, 2020 – both at the State level and District level held at Hon'ble CM Camp Office, Tadepalli - Expenditure towards arrangements – Administrative Sanction of Rs. 5,21,880/-(Rupees Five lakh twenty one thousand eight hundred and eighty only) – Orders - Issued.

PLANNING (VII) DEPARTMENT

G.O.RT.No. 27 Dated: 09-02-2021.

Read the following:

1. G.O. Rt. No.153, Planning (VII) Department, Dated:21.05.2020.
2. From the Commissioner, I&PR Department, Vijayawada, Lr.No.002617/AE/ LED Screens/2019, Dated:04.09.2020.

****

ORDER:-

In the reference 1st read above, the Government intends to assess the ground realities and impact of its numerous initiatives and also to get feedback from different stakeholders like user group/beneficiaries to further consolidate the efforts, devise future action plan and thereby set the stage for a healthy and competitive Andhra Pradesh. Commemorating one-year term in the office on 30th May, 2020, the Government decided to hold a week-long brainstorming sessions – both at the State level and District level.

2. In the reference 2nd read above, the Commissioner, Information & Public Relations Department has requested the Government in Planning Department to arrange payment of Rs. 5,21,880/-(Rupees Five lakh twenty one thousand eight hundred and eighty only) which was incurred towards arrangements of LED Screens and colour TV's at C.M camp office, Tadepalli by M/S. Amaravathi Events, Machilipatnam for organizing state level week long brainstorming sessions from 25.05.2020 to 30.05.2020.

3. Government after careful examination, hereby accord administrative sanction and release an amount of Rs.5,21,880/-(Rupees Five lakh twenty one thousand eight hundred and eighty only) to the Commissioner, I&PR Department for organizing state level week long brainstorming sessions from 25.05.2020 to 30.05.2020 for the incurred expenditure towards arrangements of LED Screens and colour TV's at C.M camp office, Tadepalli by M/S. Amaravathi Events, Machilipatnam.

4. The amount sanctioned at para (3) above shall be re-appropriate from the HOA:2052-00-090-00-07-280/281VN to the HOA:2052-00-090-SH(07) Planning

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

**HOME DEPARTMENT – INTELLIGENCE** – Sanction of **Rs.25,92,000/- as Additional Funds** towards payment of charges to M/s. Trinetra Security & Detective Services for providing security personnel at Chief Minister's Camp office, Tadepalli – Administrative Sanction – Accorded.

**HOME (BUDGET) DEPARTMENT**

**G.O.RT.No. 299** **Dated: 16-03-2021.**
**Read the Following:-**

1. From the Additional Director General of Police, Intelligence Department, Andhra Pradesh letter Rc.No.B1/7347/2020, dated 30.12.2020.
2. G.O.Rt.No.468, Finance (Home & Courts) Department, dated 13.03.2021.

&&&&&

**ORDER:**

In the circumstance stated by the Additional Director General of Police, Intelligence Department, Andhra Pradesh in the reference first read above and in pursuance of the Budget Release Order issued by the Finance (Home & Courts) Department in the reference second read above, **Government hereby accord Administrative Sanction for an amount of Rs.25,92,000/- (Rupees Twenty Five Lakh Ninety Two Thousand only) as Additional Funds during the Current Financial Year 2020-21 under the Head of Account "300-304 – Contract Services through 3rd party firms"**, in relaxation of treasury control and quarterly regulation orders pending provision of funds by obtaining supplementary grants at an appropriate time during the current Financial Year 2020-21, towards payment of charges to M/s. Trinetra Security & Detective Services for providing security personnel at Chief Minister's Camp Office, Tadepalli.

**జీవో నెంబర్ : 329**

- తాడేపల్లి ప్యాలెస్‌లో కూలర్‌లు పెట్టటానికి రూ.22.50 లక్షలు

**జీవో నెంబర్ : 330**

- తాడేపల్లి ప్యాలెస్‌లో కిటికీలు పెట్టటానికి రూ.73 లక్షలు

**జీవో నెంబర్ : 329**

- జగన్ ప్రమాణస్వీకారానికి ఎలెక్ట్రికల్ లైటింగ్ పెట్టటం కోసం : రూ.22 లక్షలు

**జీవో నెంబర్ : 1737**

- జగన్ రెడ్డి వ్యక్తిగత పర్యటన కోసం, ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేయటానికి, జెరెసులాం వెళ్ళినందుకు : రూ.22.52 లక్షలు

**జీవో నెంబర్ : 254**

- జగన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో తాత్కాలిక పనులు కోసం ఖర్చు : రూ.22.50 లక్షలు

**జీవో నెంబర్ : 1609**

- జగన్ ఫ్రెండ్ శ్రీకాంత్ రెడ్డి ఉండటానికి, బెజవాడలో ఒక అపార్ట్ మెంట్ ఫ్లాట్ అద్దె కోసం, లక్ష రూపాయలు. మళ్ళీ 5 వేలు ఖర్చుల కోసం కూడా

**జీవో నెంబర్ : 1742**

- బూడి ముత్యాల నాయుడు ఉండటానికి, బెజవాడలో ఒక అపార్ట్ మెంట్ ఫ్లాట్ అద్దె కోసం, లక్ష రూపాయలు. మళ్ళీ 5 వేలు ఖర్చుల కోసం కూడా

**జీవో నెంబర్ : 1741**

- దాడిశెట్టి రాజా ఉండటానికి, బెజవాడలో ఒక అపార్ట్ మెంట్ ఫ్లాట్ అద్దె కోసం, లక్ష రూపాయలు. మళ్ళీ 5 వేలు ఖర్చుల కోసం కూడా

**జీవో నెంబర్ : 1743**

- పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి ఉండటానికి, బెజవాడలో ఒక అపార్ట్ మెంట్ ఫ్లాట్ అద్దె కోసం, లక్ష రూపాయలు. మళ్ళీ 5 వేలు ఖర్చుల కోసం కూడా
- సాక్షిలో పని చేసే ఉద్యోగులకు, ప్రభుత్వం నుంచి జీతాలు
- సజ్జలకు ఇంట్లో టీ కప్పులు కొనుక్కోవటానికి రూ.1.50 లక్షలు
- సజ్జలకు ఇంట్లో ఫర్నిచర్ కొనుక్కోవటానికి రూ.3 లక్షలు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 22, ఆగస్టు 2024



# కన్నయ్యనాయుడుని సన్మానించిన సీఎం చంద్రబాబు

**అమరావతి,మహానాడు:**
ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారి కన్నయ్య నాయుడుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సన్మానించారు. వెలగపూడి సచివాలయంలో కన్నయ్య నాయుడుకి శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు. వరద పోటుతో ఇటీవల తుంగభద్ర జలాశయ 19వ గేటు కొట్టుకపోయింది. విషయం తెలుసు



కున్న సీఎం చంద్రబాబు సమస్యను పరిష్కరించేందుకు కన్నయ్య నాయుడికి ఫోన్ చేసి అక్కడకు వెళ్లాలని కోరారు.


పరిస్థితిని గాడిన పెట్టేందుకు ఎంతో శ్రమించిన కన్నయ్య నాయుడు వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలోనే ఏపీ, కర్నాటక అధికారుల సహకారంతో స్టాప్ లాగ్ గేటు విజయవంతంగా అమర్చారు. దీంతో సుమారు 30 టీఎంసీల నీరు వృధా కాకుండా అడ్డుకోగలిగారు.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం కన్నయ్య నాయుడిని ప్రత్యేకంగా పిలిపించుకుని మాట్లాడారు. ప్రాజెక్టులో నీరు ఉండగానే స్టాప్ లాక్ గేటు అమర్చి నీరు వృధా కాకుండా రైతాంగానికి ఎంతో మేలు చేశారని ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రైతాంగం తరపున కన్నయ్య నాయుడుకి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# తాడేపల్లి వైసీపీ కార్యాలయానికి పోలీసులు నోటీసులు

**అమరావతి,మహానాడు:**
తాడేపల్లి వైసీపీ కార్యాలయానికి పోలీసులు నోటీసులు పంపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజ్ ఇవ్వాలని పేర్కొంటూ ఈ మేరకు నోటీసులు ఇచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. టీడీపీ ఆఫీస్‌పై దాడి జరిగిన రోజు తాడేపల్లిలో ఉన్న వైసీపీ కేంద్ర కార్యాలయం సీసీ టీవీ ఫుటేజ్ ఇవ్వాలని ఇప్పటికే మంగళగిరి పోలీసులు వైసీపీ కార్యాలయం నిర్వాహకులను కోరగా.. తమ వద్ద ఎలాంటి సీసీ టీవీ పుటేజ్ లేదని చెప్పి.. నోటీసులు తీసుకోలేదు.



NOTICE U/S 160 Cr.P.C

To
YSRCP Central Party Office
Tadepalli ,
Guntur ,

అయిన తమరికి తెలియ చేయునది ఏమనగా, మంగళగిరి P.S Cr.No. 650/2021 U/s: 147,148, 452,427,323,324,506 , 326, 307, 450,380, r/w 109 , 120b, 149 IPC కేసులో మార్టిన్ దాఖలాలో నమోదు కాబడిన కేసు లో ది 19-10-2021 తేదిన మీ YSRCP Central Party Office నందు ఉపయోగించినCC కెమెరా footage 24 గం ॥ లు పై కేసు లో దర్యాప్తు నిమిత్తం మీరు ఈ క్రింది సంతకము చేసిన అధికారి అయిన మంగళగిరి రూరల్ సర్కిల్ ఆఫీసు వద్ద విచారణ నిమిత్తం ది. 16.08.2024 వ తేదీన ఉదయం 10.00 గంటలకు హాజరు అయి సదరు CC కెమెరా footage ఇవ్వవలసినదిగా మీకు తెలియ చేయటమైనది

13/8/2024
Inspector Of Police
Mangalagiri Rural Circle

# వైసీపీ పాలనలో అభివృద్ధి లేని జలాశయాలు!

◆ **మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**నెల్లూరు, మహానాడు:**
వైసీపీ పాలనలో రాష్ట్రంలోని జలాశయాలు అభివృద్ధికి నోచుకోలేదని, నెల్లూరు జిల్లాలోనే రెండు భారీ జలాశయాలు ఉన్నాయని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన పోలవరం జలాశయాన్ని కూడా పట్టించుకోలేదని దుయ్యబట్టారు.



పునర్నిర్మాణానికి కోట్లాది నిధులు అవసరమవుతాయన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం నెల్లూరు నగరంలోని సంతపేటలో గల క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పట్టిసీమ నుంచి జలాలను తీసుకొచ్చే ప్రయత్నం గత ఐదేళ్లలో చేయలేదు.. పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి.. నీటిని రాయలసీమకు పూర్తిగా ఇవ్వలేదు.. భారీగా వరదలు వచ్చి నీరు సముద్రానికి పోయిన రాయలసీమ నెల్లూరు జిల్లాలో దాహార్తిని, రైతుల అవసరాలను మాత్రం తీర్చలేదు..

జగన్ సొంత జిల్లా అభివృద్ధికి నోచుకోలేదు. అన్నమయ్య డ్యాం తెగిపోవడంతో ఆ నీరంతా సోమశిల కు వచ్చి చేరింది. భారీగా నీటిని విడుదల చేయడంతో ఆప్రాన్ దెబ్బతింది. మూడేళ్లుగా సోమశిల జలాశయానికి మరమ్మతులు చేయాలని చెబుతూనే ఉన్నాం.. జగన్ పట్టించుకోలేదు. ఇప్పుడు ఆకల నెరవేరుతోంది.. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వచ్చి జలాశయాన్ని పరిశీలించారు... గతంలో జగన్ జిల్లాలకు వస్తే చెట్లు నరకడంతో పాటు పరదాలు కట్టేవారు.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.. సమస్యలను పరిశీలించి ప్రజలతో సమస్యల గురించి చర్చించారు.. గతంలో జగన్ ప్రజలను పట్టించుకోలేదు.. చంద్రబాబు మాత్రం ప్రజలతో కలిసి కూర్చుని వారి సమస్యలు తెలుసుకున్నారు..

**పేర్లను తొలగించడం సమంజసమే...**

నెల్లూరు.. సంగం బ్యారేజీలకు పెట్టిన పేర్లను తొలగించడం సమంజసమేనని మంత్రి ఆనం అన్నారు. సంగం.. నెల్లూరు బ్యారేజ్ లకు ఆ నాయకులు ఏం చేశారో చెప్పాలి... వైసీపీ హయాంలో 10 శాతం పనులు మాత్రమే చేశారు.. మాకు సలహాలు ఇచ్చే స్థాయి గోవర్ధన్ రెడ్డికి లేదు.. కడప జిల్లాలో అన్నమయ్య విగ్రహం స్థానంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం పెట్టినప్పుడు గోవర్ధన్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదు? ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ గా మార్చినప్పుడు ఎందుకు స్పందించలేదు? ఆయన మరోసారి మాట్లాడితే నేను దీటుగా స్పందిస్తా... గతంలో జిల్లాకు చెందిన అనిల్ కుమార్ యాదవ్ జలవనరుల శాఖ మంత్రిగా ఉన్నారు. ఏం చేశారో ఏం పట్టించుకున్నారు ఎవరికీ తెలియదు..

సోమశిల జలాశయ గేట్లు పాడయ్యాయి.. ఇది మరో అన్నమయ్య డ్యాం లాగా మారుతుందని ఆందోళన చేసాం... కానీ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జలవనరుల శాఖ మంత్రి సోమశిల.. కండలేరు.. జలాశలను సందర్శించారు..

వంద రోజుల్లో అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించాం.. కానీ, 70 రోజుల్లోనే ముఖ్యమంత్రి కూడా జలాశయాన్నిసందర్శించారు.. సత్వరమే ఆప్రాన్ మరమ్మతు పనులు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్రస్టు గేట్ల తోపాటు ఇతర మరమ్మతులకు నిధులను విడుదల చేస్తామని చెప్పారు. సోమశిల నుంచి కండలేరుకు నీరు అందించే హెడ్ రెగ్యులేటర్ మరమ్మతుల కోసం రూ.5 కోట్లను మంజూరు చేశారు. సోమశిలకు శ్రీశైలం జలాశయం నుంచి నీరు వస్తోంది..

ఇప్పటికే 26 టి.ఎం.సి.లకు నీటి నిల్వ చేరింది.. కండలేరులో నీరు లేకపోవడంతో సోమశిల నుంచి 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. అక్కడ నుంచి తిరుపతికి మంచినీటిని సరఫరా చేస్తాం..

జగన్ చేసిన నష్టాలను ఒక్కొక్కటిగా పూడ్చుకుంటూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా రాష్ట్రంలో సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారు.

ఈ సమావేశంలో నెల్లూరు రూరల్, కావలి శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు గిరి నాయుడు, ఆనం రంగమయూరు రెడ్డి, రాజా నాయుడు, కోడూరు కమలాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పార్టీ పని అయిపోయినట్లే!

**(ఏ. బాబు)**

కేసీఆర్‌కి రాజకీయంగా పార్టీలను, నాయకులను వాడుకుని మళ్ళీ వాళ్లనే తిట్టటం అలవాటే. మొదట్లో ఇందిరాగాంధీ నేతృత్వంలో యూత్ కాంగ్రెస్‌లో ఉన్నాడు. 1983లో కాంగ్రెస్ ఓడిపోయినాక తెలుగు దేశంలో జేరాడు. చంద్రబాబు వద్ద మంత్రి పదవులు అనుభవించాడు. కులసమీకరణాలలో అతనికి మంత్రి పదవి ఇవ్వలేక పోతే, చంద్రబాబుని తిట్టి టీఆరెస్ పార్టీ స్థాపించాడు.

2004లో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని, తన అల్లుడికి మరో నలుగురికి రాజశేఖర్ రెడ్డి మంత్రి వర్గంలో మంత్రి పదవులు మరియు సెంటర్‌లో కాబినెట్ మంత్రి పదవి పొందాడు. 2009లో చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని చంద్రబాబుని పొగిడాడు. తెలంగాణా ఇస్తే పార్టీని కాంగ్రెస్‌లో కలిపేస్తానని సోనియాకు మాటిచ్చి, తీరా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పార్టీని కాంగ్రెస్‌లో కలపలేదు.

9 సంవత్సరాలు పాలించి కొడుక్కి, కూతురికి, అల్లుడికి పదవులు ఇచ్చి వేల కోట్లు, వేల ఎకరాలు, ఫామ్ హౌస్‌లు సంపాదించారు. కుటుంబం అంతా. పాప అయితే హైదరాబాద్‌లో ఏ పెద్ద బంగారం దుకాణం వదల్లేదు. తెలంగాణ ఉద్యమంలో అమాయకులైన కుర్రాళ్లు మంటల్లో ఆహుతి ఐతే, వీళ్ళ కుటుంబం నుండి ఒక్కరు కూడా చనిపోలేదు. హరీష్ రావుకి కిరసనాయిలు దొరికింది కానీ అగ్గిపెట్ట దొరకలేదు.

9 సంవత్సరాల పాలనలో మోడీని, బీజేపీని అసెంబ్లీలో, ప్రెస్ కాన్ఫరెన్సులలో గంటల తరబడి బండ బూతులు తిట్టి , తన కూతురు మద్యం కేసులో ఇరుక్కుంటే, ఇప్పుడు ఢిల్లీ పెద్దలతో



లోపాయికారీ ఒప్పందం చేసుకుని, పార్టీని బీజేపీ లో కలపటానికి సిద్ధమయ్యాడు .ఇతనిని నమ్మితే, బీజేపీ మోసపోతుంది.

2014లో ఎన్నికలలో గెలిచాక , కుటుంబం అంతా ఢిల్లీ వెళ్ళి సోనియా కాళ్ళ మీద పడి ధన్యవాదాలు చెప్పారు.ఇప్పుడు రాజీవ్ గాంధీ విగ్రహం అసెంబ్లీ ముందు పెట్టనీయరట. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విగ్రహం తీయించేస్తామని ""లోకల్ ఫీలింగ్"" రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్‌ని, ఆ కుటుంబాన్ని నమ్మే రోజులు పోయాయి.ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలలో 8 సీట్లలో డిపాజిట్లు రాలేదు .ఇక కేసీఆర్ పార్టీ పని అయిపోయినట్లే!! ఎవరూ ఇక నమ్మరు. బిఆర్‌యస్ ఖాళీ...రిటర్న్ గిఫ్ట్... దేవుని నిర్ణయం.

# భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండండి

◆ **సత్యసాయి కలెక్టర్ చేతన్‌తో మంత్రి సవిత**

**పుట్టపర్తి, మహానాడు:**
మూడురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈమేరకు అమరావతి నుంచి కలెక్టర్ తో మంత్రి ఫోన్లో మాట్లాడారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నడుమ భారీ వర్షాల కురవడం ఆనందంగా ఉందన్నారు. అదే సమయంలో నదీ తీరప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

జిల్లాలో ఎక్కడైనా పంట నష్టం వాటిల్లితే తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందజేయాలని కలెక్టర్ ను మంత్రి సవిత ఆదేశించారు. వరుస వర్షాలతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మంత్రి అలెర్ట్ చేశారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని, మురికి కాలువల్లో మురుగు తొలగించాలని, వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు.

ముఖ్యంగా హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు వేడి



ఆహారం, గోరువెచ్చని నీరు అందించాలన్నారు. విద్యార్థులకు అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య సేవలు అందించాలన్నారు. బయట ఆహారాలు హాస్టళ్లోకి వెళ్లనివ్వకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ను ఫోన్ లో మంత్రి సవిత ఆదేశించారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే విష జ్వరాలకు ప్రజలు బలి!

◆ **మాజీ మంత్రి హరీష్‌రావు**

**హైదరాబాద్, మహానాడు:**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రజలు విష జ్వరాలకు బలవుతున్నారని, డెంగీ, మలేరియా, గున్యా వంటి విష జ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేకపోవడం శోచనీయమని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ మేరకు బుధవారం మీడియాతో మాట్లా డారు. డెంగీ జ్వరాల బారిన పడి 24 గంటల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితులు వస్తాయని ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించాం. నిధులు విడుదల చేసి పారిశుద్ధ్య నిర్వహణ కొనసాగించాలని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని వానాకాలం ప్రారంభంలోనే కోరాం. కానీ ప్రభుత్వం మా సూచనలను పెడచెవిన పెట్టింది. సకాలంలో చర్యలు తీసుకొని ఉంటే విషజ్వరాలు ఇంతగా విజృంభించేవి



కావు.

ఏటా వానాకాలం ప్రారంభంలోనే పారిశుద్ధ్య చర్యలు తీసు కోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. కానీ ఈ ప్రభుత్వం మొదటి నుంచి పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ వచ్చింది. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఒక్కనాడు కూడా సమీక్ష నిర్వహించ లేదు. దోమల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టలేదు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పారిశుద్ధ్య నిర్వహణ, ఆసుపత్రుల సన్నద్ధత వంటి ముఖ్యమైన అంశాలపై తక్షణం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి వైరల్ ఫీవర్స్ బారిన పడి ప్రజలు కాపాడాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

# స్పామ్ కాల్, మెసేజ్‌లపై ట్రాయ్ ఉక్కుపాదం!

**న్యూఢిల్లీ,మహానాడు:**
క్రెడిట్ కార్డు కావాలా? లోన్లు కావాలా? ఫ్లాట్ కావాలా? అంటూ ఇలా పదే పదే ఇబ్బందులు పెడుతూ చాలా మందికి ప్రతి రోజు వందల్లో కాల్స్ వస్తుంటాయి. ఇలాంటి మోసపూరిత కాల్స్, సందేశాలు పంపే టెలిమార్కెటర్లపై, టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) మరిన్ని కఠిన చర్యలకు దిగింది. వినియోగదారులను మోసపూరిత కాల్స్ నుంచి రక్షించేందుకు, మెసేజింగ్ సేవలు దుర్వినియోగం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని టెలికాం సంస్థలను ట్రాయ్ ఆదేశించింది.



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com



డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 22, ఆగస్టు 2024





# వైసీపీ రౌడీల బారి నుంచి రక్షించండి!

- 29వ రోజు మంత్రి నారా లోకేష్ 'ప్రజా దర్బార్'కు విన్నపాల వెల్లువ
- సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

**అమరావతి, మహానాడు:**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ 'ప్రజాదర్బార్'కు బుధవారం విన్నపాలు వెల్లువెత్తాయి. ఉండవల్లిలోని నివాసంలో 29వ రోజు కార్యక్రమానికి మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను విన్నవించారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పెన్షన్ అందించాలని, వైద్యానికి ఆర్థిక సాయం చేయాలని, భూకబ్జాదారులను తరిమివేయాలని, సొంతింటి కల నెరవేర్చా లని, విద్య, ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## మంగళగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన విన్నపాలు

### వైసీపీ రౌడీలు గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జా చేశారు

వైసీపీ రౌడీలు తన గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జా చేశారని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రిటైర్డ్ రైల్వే డ్రైవర్ పిల్లి అబ్రహాం, కుమార్తె పిల్లి సుధారాణి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేత, దుగ్గిరాల జడ్పీటీసీ దాసరి వీరయ్య, అతని అనుచరులైన రౌడీషీటర్, తెనాలి వన్ టౌన్ వైసీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర, గెడ్డేటి బాలయ్య, రౌడీషీటర్ మహంకాళి, పిల్లి తిరుపతయ్య, మహేష్ లు కలిసి వేధిస్తున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. వృద్ధుడినైన తనపై దాడిచేసి చంపుతామని బెదిరిస్తున్నారని, ఇంటిని ధ్వంసం చేసి బయటకు గెంటేశారని వాపోయారు. దిక్కుతోచని స్థితిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. పలు భూకబ్జాలు, హత్యలు, సెటిల్ మెంట్ల కేసుల్లో ముద్దాయిలైన వైసీపీ రౌడీల బారి నుంచి ప్రాణరక్షణ కల్పించి, తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



- కోవిడ్ సమయంలో భర్త చనిపోయారని, కూలి పనులు చేసుకుని జీవనం సాగించే తనకు కుటుంబ పోషణ భారంగా మారిందని, బీమా అందించడంతో పాటు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడికి చెందిన బి.భారతి కోరారు.
- వైసీపీ ప్రభుత్వం తొలగించిన వృద్ధాప్య పెన్షన్ ను పునరుద్ధరించాలని తాడేపల్లికి చెందిన నందూరి మురళీమోహన్ విజ్ఞప్తి చేశారు.



- దివ్యాంగ పెన్షన్ కోసం గత ప్రభుత్వంలో పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేదని, ఎలాంటి ఆధారం లేని తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరుచేసి ఆదుకోవాలని యర్రబాలెంకు చెందిన షేక్ కరిమున్ కోరారు.
- అద్దె ఇంట్లో జీవనం సాగించే తమకు ఇంటి స్థలం కేటాయించాలని మంగళగిరి కొప్పారావుకాలనీకి చెందిన ఏ.పుష్పావతి విజ్ఞప్తి చేశారు.
- ఐదు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తన ఇంటికి పట్టా మంజూరు చేయాలని తాడేపల్లికి చెందిన కొమ్మినేని సాంబశివరావు కోరారు. ఆయా విన్నపాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

## రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వినతులు

### కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆర్థికసాయం అందించండి

కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా నారాకోడూరుకు చెందిన కోడూర్ వినోద్ కుమార్ మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.

- టీడీపీ సానుభూతిపరులంటూ చిత్తూరు జిల్లాలో పనిచేసే పలువురు హోంగార్డులను అన్నమయ్య జిల్లాకు వెళ్లాలని గతంలో అధికారులు ఆదేశించారని, సొంత జిల్లాలోనే విధులు నిర్వహించేలా తగిన ఉత్తర్వులు ఇచ్చి న్యాయం చేయాలని జిల్లాకు చెందిన హోంగార్డులు కోరారు.
- విజయనగరం జిల్లా కోనాడ జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, నైట్ వాచ్ మెన్ సక్రమంగా విధులు నిర్వర్తించడంలేదని, వారిని తొలగించాలని పాఠశాల మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్, సభ్యులు విజ్ఞప్తి చేశారు.
- గత ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరులనే నెపంతో 14 మందిపై అక్రమంగా నమోదు చేసిన కేసులను ఉపసంహరించేలా చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా వెల్దూరు గ్రామ సర్పంచ్ నాయన సత్యవతి కోరారు.
- శ్రీకాకుళం జిల్లా పరిషత్ లో గత ఏడేళ్ల నుంచి పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాల సమస్య పరిష్కరించాలని దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేశారు.
- గ్రామ సచివాలయంలో పనిచేసే సంక్షేమ, విద్యా సహాయకులను మాతృశాఖ అయిన సాంఘిక సంక్షేమ శాఖలో విలీనం చేయడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించాలని గ్రామ వార్డు ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.
- వంశపారంపర్యంగా తనకు సంక్రమించిన 1.46 ఎకరాలను ఆన్ లైన్ లో నమోదుచేయడంతో పాటు పాస్ బుక్ మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గురిజేపల్లికి చెందిన వీరారెడ్డి విజ్ఞప్తి చేశారు.
- నకిలీ పత్రాలతో వంశపారంపర్యంగా వచ్చిన తమ రెండెకరాల పొలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారి జూలకంటి బుడే కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మొక్కరాల నరసమ్మ కోరారు.
- ఎలక్ట్రికల్ టెక్నీషియన్ లో వెకేషనల్ కోర్సు పూర్తిచేసిన వారికి 11 కేవీయే సబ్ స్టేషన్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కల్పించాలని సత్యసాయి జిల్లా నిద్రగట్టకు చెందిన ఎల్.కె ప్రశాంత్ కుమార్ విజ్ఞప్తి చేశారు.
- సత్యసాయి వాటర్ సప్లై కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, కార్మికులకు జీతాలు ఇవ్వడంతో పాటు ప్రాజెక్టుకు పూర్వవైభవం కోసం చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా సత్యసాయి వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.















జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం 22, ఆగస్టు 2024

## జగన్, విజయసాయిలు డబ్బుల్లేని జీవితం నుంచి ఎలా ఎదిగారు?

◆ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

**మంగళగిరి, మహానాడు:**



సినిమా టికెట్ కొనడానికి డబ్బుల్లేని జీవితం గడిపిన జగన్, విజయసాయిలు నేడు యూరప్ కు వెళ్లగలిగేలా ఎలా ఎదిగారని వర్ల రామయ్య ప్రశ్నించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

జగన్, విజయసాయిరెడ్డిలాంటి వారికి కోర్టులు వెసలుబాటు కల్పించడం కరెక్టు కాదు. ఏ1 ముద్దాయి జగన్, ఏ2 ముద్దాయి విజయ సాయికి యూరప్‌లో ఏమున్నాయని పర్యటనలకు అను మతి కోరుతున్నారు? వీరిపై విచారణ ఎందుకు జరగడంలేదు, వీరు కోర్టులకు ఎందుకు హాజరు కావడంలేదు? సీఎం కేజ్రీవాల్ సీఎం అయినా జైలులో ఉన్నారు... మరి జగన్ సీఎంగా ఉన్న పుడు కేసులున్నప్పటికి ఎందుకు బయట ఉన్నాడు?. 12 ఏళ్ళపాటు జగన్, విజయసాయిలపై విచారణ జరపకపోవడంలో అర్థమేంటి? కోర్టుల మీద నమ్మకం సన్నగిల్లే ప్రమాదాల నుంచి కాపాడాలని జస్టిస్ చంద్రచూడ్‌ని కోరుతున్నాను.

జగన్ కేసులో రోజువారి విచారణ జరగాలి, జగన్ తప్పు చేశాడా లేదా అని త్వరితగతిన కోర్టు తేల్చాలి. యూరప్ పర్యటకు జగన్‌కు పర్మిషన్ ఇస్తే ఇతర ముద్దాయిలు కూడా పర్మిషన్ అడగగలరు. అవినీతిపరులు, నేర చరిత్రగల జగన్, విజయ సాయిలు బాహ్య ప్రపంచంలో తిరుగుతుంటే బాధేస్తోంది. జగన్ విదేశాలకు వెళితే ఏం జరుగగలదో కోర్టు పునఃపరిశీలన చేయాలి. కేసుల విచారణ పూర్తయ్యేవరకు జగన్ విదేశాలకు వెళ్లకుండా చూడాలి.

జగన్ సీఎం హెూదా పోయి నేడు శాసనసభ్యుడిగా మిగిలారు. ఇక విజయ సాయిరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఉన్నాడు. మంచి రికార్డులున్నవారు, పెద్దలు మాత్రమే రాజ్యసభలో ఉంటే తులసివనంలో గంజాయి మొక్కలా విజయసాయి ఎంపీగా ఉన్నారు. లోక్ సభలో పాస్ అయిన బిల్లులను రాజ్యసభకు పంపి స్తారు. రాజ్య సభలో ఆమోదం పొందాక ఆ బిల్లులు అమలు లోకి వస్తాయి. అలాంటి అత్యున్నత సభలో విజయసాయి ఉండడం బాధాకరం.

ఎన్నో కేసుల్లో ఏ1గా ఉన్న వ్యక్తి ఇప్పుడు విదేశాలకు వెళ్ళడానికి అనుమతిస్తే ఆయన తిరిగి భారతదేశానికి వస్తారన్న నమ్మకం లేదు. ఏ2 గా ప్రతీ కేసులో ఏ1 కు తోడు నీడగా ఉన్న విజయసాయిరెడ్డి కూడా ఈ పరిస్థితుల్లో విదేశాలకు పోవడానికి కోర్టు అనుమతి ఇవ్వకూడదు. ఇస్తే తిరిగిరారు. 12 ఏళ్ళ కిందట వీరిద్దరి మీద సీబీఐ చార్జ్ షీట్‌లు వేస్తే ఇంతవరకు విచారణ మొదలుపెట్టలేదు.. ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. ఈ కేసుల్లో విచారణ పూర్తయ్యేంతవరకు ముద్దాయిలకు విదేశీ యాత్రలకు అనుమతి ఇవ్వకూడదని టీడీపీ పొలిట్ బ్యూరో వర్ల రామయ్య కోరారు.

## మరుగుదొడ్ల ఫోటోలకు పట్టభద్రులెందుకు?

◆ ఏపీ సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాని పాషా

**అమరావతి, మహానాడు:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ వ్యవస్థలో గ్రామ, వార్డు సచి వాలయ ఉద్యోగులపై ఐదేళ్ళుగా వివక్ష కొనసాగుతోందని, పట్టభద్రులకు మరుగుదొడ్ల ఫోటోలు తీయమంటున్నారని ఈ నిర్ణయం తగదని ఏపీ సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాని పాషా అన్నారు.

ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విద్యావంతులైన సచివాలయ ఉద్యోగులను జాబ్ చార్ట్ ప్రకారం కాకుండా రోజు కూలీల మాదిరిగా ప్రతి పనికీ వినియోగించుకుంటున్నారని విమర్శించారు. ఇలా.. ఉద్యోగ వ్యవస్థలో చులకన చేస్తున్నారని, ఐదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ, పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న ఉద్యోగులకు నిరాశే కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సచివాలయ ఉద్యోగులు ఉద్యోగాలుగా పని చేయడం మేము చేసుకున్న పాపమా.? మమ్మల్ని వివిధ ప్రభుత్వ శాఖ లకు కేటాయించాలి.. తద్వారా మాత్రమే అజమాయిషీ చెలా యించే వారి నుండి విముక్తి లభిస్తుందన్నారు. గతంలో సులభ్ కంప్లెక్స్‌ల వద్ద, పార్కుల వద్ద, రోజువారీ వ్యాపారాలు చేసుకునే వారి వద్ద ఆశీలు వసూళ్ళ కోసం, చెత్త శుభ్రం చేయడం కోసం విధులు, చెత్త పన్ను వసూలు, అంగన్వాడీ సెంటర్ల విధులు వంటి సంబంధం లేని పనులు అప్పగించి అవమానించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు.

సచివాలయ ఉద్యోగులు ఇరవై లక్షల మందితో పోటీ పడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించామని మాపై ఎందుకిలా వివక్ష చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణం పాఠశాల విద్యాశాఖ ఆ ఆదేశాలు ఉపసంహరించుకోవాలని కోరారు.





## రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పురోగమిస్తోంది

◆ మంత్రి సవిత

**అవనిగడ్డ, మహానాడు:** ముఖ్యమంత్రి చంద్రబాబు సాంర్థ్యంలో రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పురోగమిస్తోందని మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు ఆమె కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో బుధవారం పర్యటించారు. ఆమెకు నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మోపిదేవి గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతులు, మెనూ పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో నూతన భవనాలు నిర్మిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల పునరుద్ధరించిందని,



ఉచిత ఇసుక హామీలు ఇప్పటికే అమలు చేశామని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అవినీతి గుట్టలుగా బయటకు వస్తోందన్నారు.





# ప్రకృతి సేద్యం ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం

◆ ప్రకృతి వ్యవసాయ విధానాలతో పర్యావరణానికీ ఎంతో మేలు

◆ జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్న చెవుటూరు రైతులు

◆ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

**ఎన్‌టీఆర్ జిల్లా/ జి.కొండూరు,**

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఈ వ్యవసాయ విధానంతో పర్యావరణానికీ ఎంతో మేలు జరుగుతుందని.. జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో చెవుటూరు రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అన్నారు.





బుధవారం కలెక్టర్ సృజన జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామ పరిధి లోని రైతులు అనుసరిస్తున్న జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. నేలకు బలం.. పంటకు ఆరోగ్యాన్నిచ్చే జీవామృతం తయారీ విధానాన్ని పరిశీలించారు. అదే విధంగా వివిధ రకాల కషాయాల తయారీ, వినియోగించే విధానాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంత రైతులు, కౌలు రైతులు తాము ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న పంటలు, దిగుబడి, మార్కెటింగ్ తదితర వివరాలను కలెక్టర్, అధికారులతో పంచుకున్నారు.

జీరో బడ్జెట్ ప్రకృతి సాగుతో తాము ఎంతో లాభపడుతున్నామని.. తోటల్లో, చేల గట్ల మీద వేసే అంతర పంటలతో అదనపు ఆదాయం లభిస్తోందని, తాము ఇళ్లలో ఇవే ఉత్పత్తులను వినియోగిస్తున్నామని తెలిపారు. అసక్తికలిగిన వారికి కూడా ఈ సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సీతాఫలం, ఉమ్మెత్త, వేప తదితర పది రకాల ఆకులతో తయారుచేసే కషాయం మంచి ఫలితాలు ఇస్తోందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా 5204 రకం వరి సాగు ద్వారా మంచి రాబడి వస్తోందని ఓ రైతు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.సృజన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందని.. జిల్లాలో పెద్ద ఎత్తున ఈ విధానాలను అమలుచేసేలా రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా జీవామృతం, వివిధ కషాయాలను ఉపయోగించి చేసే సాగుతో వచ్చే ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తాయన్నారు. గత నాలుగైదేళ్లుగా చెవుటూరు రైతులు జీరో బడ్జెట్ ప్రకృతి సేద్యం చేస్తూ, దాంతో ప్రయోజనాలు పొందుతున్నారని, నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

వాణిజ్య పరంగా ఈ విధానం గిట్టుబాటు కాదు అనే అపోహలను వీరు దూరం చేశారన్నారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులను పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వసతిగృహాల్లో వినియోగించేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న స్థలాల్లో ప్రకృతి సేద్యంతో కిచెన్ గార్డెన్లను







అభివృద్ధి చేసేలా చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యా ర్థులకూ ఈ విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సేద్యానికి అవసరమయ్యే కషాయాలు వంటివి తయారుచేసుకోలేని వారికి వీలుగా డీఆర్‌డీఏ, ఔత్సాహిక రైతుల ద్వారా దుకాణాల ద్వారా విక్రయానికి పైలట్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు కలెక్టర్ సృజన వివరించారు.

### అంగన్వాడీ, పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

కలెక్టర్ సృజన.. చెవుటూరులోని అంగన్వాడీ ప్రీ ప్రైమరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి.. ట్రేలో విత్తనాలు చల్లారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి టీచింగ్ ప్లాన్ ప్రకారం బోధన జరిగేలా చూడాలన్నారు. అదే విధంగా కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు అమలుచేయాలని ఆదేశించారు. బడిబయట పిల్లలు ఉండకుండా ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నామని.. 100 శాతం పాఠశాలల్లో నమోదు జరిగేలా చూస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి జి.మోహన్‌బాబు, ఎంపీడీవో పి.అనురాధ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 22, ఆగస్టు 2024

# సమిష్టిగా కృషి చేస్తేనే స్టేడియం అభివృద్ధి

◆ **ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)**

**విజయవాడ, మహానాడు:**

యువత క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకునే విధంగా మాకినేని బసవపున్నయ్య నగర పాలక సంస్థ స్టేడియాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి సమిష్టిగా అభివృద్ధి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. అజిత్ సింగ్ నగర్‌లోని స్టేడియాన్ని బుధవారం ఎమ్మెల్యే, ఎంపీ సందర్శించారు.

స్టేడియంలో వర్షం పడినప్పుడు గ్రౌండ్‌లో నీరు నిలిచి పోతున్న విషయం చెప్పటంతో పాటు, కొంత మెరక లేపాల్సిన అవసరం వుందని ఎంపీ కు ఎమ్మెల్యే ఉమా వివరించారు. క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేందుకు కావాల్సిన విధంగా స్టేడియాన్ని తీర్చిదిద్దటంతోపాటు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ మహిళ



అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, 61వ డివిజన్ టీడీపీప్రెసిడెంట్ దాసరి దుర్గారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నవనీతం సాంబశివరావు, ఎస్సీసెల్ నియోజకవర్గ కార్యదర్శి బెజ్జం జైపాల్, మైనార్టీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి బాషా, తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై అవగాహన లేనివారు
# అవాకులు చవాకులు పేలుతున్నారు..

◆ **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**మధిర, మహానాడు:**

రూ.రెండు లక్షల రుణమాఫీపై అవగాహన లేని వారు కూడా అవాకులు చవాకులు పేలుతున్నారని డిప్యూటీ సీఎం



భట్టి విక్రమార్క విమర్శించారు. ఈ మేరు ఆయన బుధవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని జమలాపురంలో మాట్లాడారు.

ఐదు సంవత్సరాల్లో లక్ష రుణమాఫీ చేయలేని వాళ్లు ... మొదటి సంవత్సరంలోనే 2 లక్షల రుణమాఫీ చేసిన వారి గురించి సిగ్గు.. ఎగ్గు లేకుండా మాట్లాడుతున్నారు.. ఈ భాష మాట్లాడడానికి బాధగా ఉంది. రెండు లక్షల పైన బ్యాంకు రుణం తీసుకున్న రైతులు .. పై మొత్తాన్ని చెల్లించి వ్యవసాయ శాఖకు సమాచారం ఇస్తే వెంటనే 2 లక్షల రుణమాఫీ అవుతుంది.

రుణమాఫీకి సంబంధించి ఈ దేశంలో ఎవరు ఊహించని విధంగా, ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేశాం. అది కూడా అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే పూర్తి చేశాం. జూలై 17న రుణమాఫీ జీవో ఇచ్చి వెంటనే 18వ తేదీన మొదటి విడత లక్ష వరకు రుణం ఉన్నవారి ఖాతాలో డబ్బులు జమచేశాం. రెండో విడత 15 రోజుల వ్యవధిలోనే ఆలస్యం జరగకుండా జూలై 30న అసెంబ్లీలో లక్షన్నర వరకు బ్యాంకు రుణం ఉన్నవారికి వారి ఖాతాల్లో నగదు జమ చేశాం. మూడో విడత ఆగస్టు 15న వైరా బహిరంగ సభలో రెండు లక్షల వరకు బ్యాంకు రుణం ఉన్న రైతుల ఖాతాలోకి నగదు జమ చేశాం.

గత పాలకులు 2014 నుంచి 2018 వరకు లక్ష రుణం ఐదు సంవత్సరాల పాలనా కాలంలో నాలుగు వాయిదాలలో చెల్లించారు. వారు వాయిదాలలో చెల్లించడంతో అది వడ్డీలకే సరిపోయింది.. బ్యాంకర్లు రైతులకు కొత్తగా రుణాలు ఇవ్వలేకపోయారు. రెండో దఫా అధికారంలోకి వచ్చినప్పుడు ఎన్నికల ముందు అరకొరగా రైతులకు రుణమాఫీ చేశారు.

ఇది ప్రజా ప్రభుత్వం.. మీలాగా మేము దోపిడీలు చేయలేదు. రాష్ట్ర సంపద ప్రతి పైసా పేదవారికి చేరుస్తాం. గత పది సంవత్సరాలు పంటల బీమా కూడా చేయని పాలకులు వీరు. పంట నష్టపోతే ఒక్క రూపాయి కూడా రైతులకు రాలేదు. మేము అధికారంలోకి రాగానే పంటల బీమా కోసం రైతులు కట్టాల్సిన డబ్బులను బీమా కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించింది. త్వరలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఖరారు చేసి.. భూమి పూజలు చేయనున్నామన్నారు.

# ఏపీలో బీజేపీ సభ్యత్వం కోటికి పెరగాలి

◆ **పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి**

**విజయవాడ, మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) సభ్యత్వం కోటికి పెరగాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పెనములూరులో బుధవారం సభ్యత్వ నమోదుపై పార్టీ సమావేశం జరిగింది. పురందేశ్వరి అధ్యక్షత వహించి, మాట్లాడారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం అనేది బాధ్యతని అన్నారు. పార్టీ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం.. దేశ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి కొరకు గొప్ప లక్ష్యాన్ని పెట్టుకున్నాం... దానిని చేరుకునేందుకు నిరంతరం కృషి చేయాలి. పాశ్చాత్య ఆలోచన ధోరణి కి స్వస్తి పలికెందుకు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆలోచనల నుంచి బీజేపీ ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఒక సిద్ధాంతంతో, కార్యకర్త



బలంతో ముందుకు వెళుతోంది.. 1984 లో పార్లమెంట్ సభల్లో ఇద్దరితో ప్రయాణం మొదలైందన్నారు. ప్రస్తుతం దేశ అభివృద్ధి కొరకు బీజేపీ ప్రభుత్వం పని చేస్తోంది. భారతీయ సంస్కృతి విధి విధానాలతో బీజేపీ ముందుకువెళుతోంది. మోదీ నాయకత్వంలో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సిద్ధాంతంతో పాలిస్తోంది. అనంతరం సభ్యత్వ నమోదు రాష్ట్ర ప్రముఖ్‌గా సన్నారెడ్డి దయాకర్ రెడ్డిని పురందేశ్వరి ప్రకటించారు. సభ్యులుగా సురేంద్ర మోహన్, మట్టా ప్రసాద్, వల్లూరు జయ



ప్రకాష్, సిహెచ్ సావిత్రి, జీసీ నాయుడులు ఉంటారు.

పార్టీ ఏపీ సభ్యత్వ ఇంచార్జి, జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్ ప్రసంగిస్తూ సభ్యత్వ నమోదులో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అదేవిధంగా సభ్యత్వ నమోదులో కార్యకర్తలే కీలక పాత్రదారులన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని సభ్యత్వ నమోదు పార్టీ బలాన్ని సూచిస్తుందని తెలిపారు. ఈ దృష్ట్యా నిర్దేశిత సమయంలో సభ్యత్వ నమోదు నిర్వహించాలన్నారు. ఏఏ సందర్భాల్లో సభ్యత్వ నమోదు చేస్తే వేగంగా ఈ కార్యక్రమం పూర్తి చేయగలమో వివరించారు. బీజేపీ సర్వవ్యాపి, సర్వస్పర్శి... అందువల్ల జాతీయ భావాలు కలిగిన కార్యకర్తల గణం బీజేపీ సొంతం అన్నారు.

యూపీ మాజీ మంత్రి ఎమ్మెల్యే సిద్ధార్థనాథ్ సింగ్ ప్రసంగిస్తూ భారతీయ జనసంఘ్ ఏర్పడిన 1952 నుండి ఇప్పటి వరకు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ జిల పార్టీ సిద్ధాంతం మారలేదన్నారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ సభ్యత్వ నమోదు పై పీపీటీ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాజీ ముఖ్య మంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ పెన్మత్స విష్ణు కుమార్ రాజు, విప్‌సి.ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్యే లు కామినేని శ్రీనివాస్, సుజనాచౌదరి, డాక్టర్ పార్థసారథి, ఎన్.ఈశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, సభ్యత్వ నమోదు రాష్ట్ర ప్రముఖ్ సన్నారెడ్డిదయాకర్ రెడ్డి, తదితరులు వేదికను అలంకరించారు.



**పరిగి, మహానాడు:**

పెనుకొండ నియోజకవర్గం పరిగి మండల కేంద్రం నందు ఎంపీ నిధులతో కోటి రూపాయలతో నిర్మించబోయే వాల్మీకి కల్యాణమండపంనకు స్థలాన్ని పరిశీలించిన హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారథి గారు, కుమారుడు సాయికళ్యాణ్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు....



## ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణతో ప్రమాణం చేయించిన కౌన్సిల్ చైర్మన్ కె.మోషేన్ రాజు.

**అమరావతి,21 ఆగస్టు,మహానాడు:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా ఇటీవల ఎన్నికైన మాజీమంత్రి బొత్స సత్యనారాయణచే బుధవారం రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు వారి చాంబరులో బొత్సతో ఎమ్మెల్సీగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, సంయుక్త కార్యదర్శి యం.విజయరాజు పాల్గొన్నారు.



## రాజధాని నిర్మాణం, అన్న క్యాంటీన్లకు రూ.2 కోట్ల విరాళం ఇచ్చిన పారిశ్రామికవేత్త ఠాగూర్

● **రాజధానికి రూ.10 లక్షలు విరాళం ఇచ్చిన ఎన్వీ నారాయణ రెడ్డి**

● **అభినందించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి,**

అన్నక్యాంటీన్, అమరావతి రాజధాని నిర్మాణానికి పలువురు విరాళాలు అందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని బుధవారం సచివాలయంలో కలిసి చెక్కులు అందించారు. విజయవాడకు చెందిన పారిశ్రామిక వేత్త, డీఆర్ఎన్ ఠాగూర్ గ్రూప్ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్ అమరావతి రాజధాని, అన్న క్యాంటీన్ లకు కోటి రూపాయలు చొప్పున రూ.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. కడప జిల్లా, పాయసం పల్లెకు చెందిన ఎన్వీ నారాయణ రెడ్డి రాజధానికి రూ.10,00,116ను విరాళంగా అందించారు.



రాజధానిలో భాగస్వామ్యం కావాలనే స్ఫూర్తితో, పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ కు చేయూతను ఇవ్వాలనే మంచి ఆలోచనతో విరాళం ఇచ్చిన రవీంద్రనాథ్ ఠాకూర్, ఎన్వీ నారాయణ రెడ్డిలను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

# థర్డుపార్టీ ఏజన్సీల వల్లే కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు సన్నగిల్లాయి

● **అనకాపల్లి సెజ్‌లో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు తక్షణ సహాయ చర్యలు అందజేస్తున్నాం**

● **కార్మిక, ప్యాక్టరీలు, బాయిలర్స్ & భీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

**అమరావతి, ఆగస్టు 21:**

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన థర్డు పార్టీ ఏజన్సీ విధానం కారణంగానే కంపెనీల్లో భద్రణా ప్రమాణాలు సన్నగిల్లి ప్రమాదాలకు దారితీస్తున్నాయని రాష్ట్ర కార్మిక, ప్యాక్టరీలు, బాయిలర్స్ & భీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

బుధవారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ లో రియాక్టరు ప్రేలడం వల్ల జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మట్లాడుతూ బాదితులకు తక్షణ సహాయక చర్యలు అందజేస్తున్నట్లు తెలిపారు.

అచ్యుతాపురం సెజ్ లో ఎసెన్సియా అడ్వాన్సుడ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రియాక్టర్ ప్రేలిన ప్రమాదంలో గాయపడిన వారిని తక్షణ సహాయక చర్యల్లో భాగంగా దగ్గర్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స అందజేయడం జరుగుతున్నదన్నారు. జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ సంఘన స్థలానికి హుటాహుటిన చేరుకుని సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారన్నారు.

గత ప్రభుత్వ హయాంలో థర్డు పార్టీ ఏజన్సీ విధా




నాన్ని ప్రవేశపెట్టడం వల్ల కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పూర్తిగా సన్నగిల్లాయన్నారు. కార్మిక శాఖ పూర్త స్థాయిలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. విశాఖపట్నంలో దళారీ వ్యవస్థ ఎక్కువగా ఉందన్నారు. ఇ.ఎస్.ఐ. ఆసుపత్రుల నిర్వహణ కూడా పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేయడం జరిగిందని, కేంద్ర నిధులను కూడా సక్రమంగా వినియోగించుకో లేకపోవడం జరిగిందన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన రాయితీలను, సంక్షేమ పథకాలను నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఈ సమస్యలను అన్నింటినీ సరిదిద్దేందుకు అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహిస్తూ కార్మిక శాఖలో పూర్వవైభవాన్ని తీసుకు వచ్చేందకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.



## రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన మదనపల్లి మండల టీడీపీ నేతలు

**విజయవాడ, ఆగస్టు 21,**

మదనపల్లి నియోజకవర్గం, నిమ్మనపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు విజయవాడ క్యాంపు కార్యాలయంలో రవాణా, క్రీడ యువజన శాఖ మంత్రివర్యులు మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్న మండల పార్టీ ప్రెసిడెంట్ పి.వెంకటరమణ మాజీ మండల అధ్యక్షులు పి.శ్రీనివాస్ యువజన నాయకులు బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ దేవాదాయ శాఖ కేంద్ర కార్యాలయంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మాత్యులు శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి, ప్రత్యేక పూజా కార ్యక్రమాలు చేపట్టారు. రాష్ట్రం సుభిక్షంగా వర్థిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలను మంత్రి సురేఖ ఆసక్తిగా తిలకించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, పలువురు అధికారులు మంత్రితో సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంత రావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



7
జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం 22, ఆగస్టు 2024

# ఎసెన్షియా సంస్థలో ఘోర ప్రమాదంపై అధికారులతో చర్చించిన పవన్ కళ్యాణ్

## సంబంధిత శాఖలు సమన్వయంతో సేఫ్టీ ఆడిట్ చేపట్టాలి

**అనకాపల్లి,మహానాడు:**

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్ లో జరిగిన ఘోర ప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులతో చర్చించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇటువంటి కర్మాగారాల్లో భద్రతను డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, లేబర్, ఫైర్, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండే పెట్రోలియం అండ్ ఎక్స్ ప్లోజివ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ పర్యవేక్షిస్తాయి. కాలుష్య నియంత్రణ మండలి మాత్రం నిబంధనల అతిక్రమణ జరిగిందా? అంతా సక్రమంగానే ఉన్నాయా అనే విషయాన్ని పర్యవేక్షిస్తుంది. ప్రమాదం వైఫల్యానికి ఎవరు బాధ్యులు అనే విషయమై ఉప ముఖ్యమంత్రివర్యులు ఆరా తీశారు. ఎసెన్షియా అడ్వాన్స్ సైన్స్ ప్రై. లిమిటెడ్ పేరిట కొనసాగుతున్న ఈ రసాయనిక కర్మాగారానికి ఇద్దరు యజమానులు ఉన్నారు. ఈ యజమానులు ఇద్దరి మధ్యన విబేధాలు కొనసాగుతున్నట్టు అధికారులు తెలియచేశారు. రియాక్టర్ పేలి ఈ ప్రమాదం సంభవించిందని బయటకి ప్రచారం జరుగుతున్నా సాల్వెంట్ ఆయిల్ ను ఒక అంతస్తు నుంచి మరొక అంతస్తుకు పంప్ చేసే క్రమంలో లీకై మంటలు చెలరేగాయని అనంతరం పెద్ద పేలుడుతో ప్రమాదం సంభవించిందని అధికారులు తెలిపారు.

ప్రమాద ప్రాంతాన్ని స్వయంగా వచ్చి పరిశీలించి క్షతగాత్రులను పరామర్శించడానికి రావడానికి ఉప ముఖ్యమంత్రి సంసిద్ధత వ్యక్తం చేసినా సహాయ చర్యలకు ఆటంకం కలుగుతుందన్న అధికారుల సూచనతో ఆ యోచనను తాత్కాలికంగా విరమించుకున్నారు. భారీ స్థాయిలో ప్రమాదం జరగడం 16 మంది ప్రాణాలు కోల్పోవడం, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడడం తీవ్రంగా కలచివేసిందని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

ఉప ముఖ్యమంత్రితో జిల్లా కలెక్టర్, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాట్లాడారు .ఒకే ప్రాంతంలో తరచూ ఇటువంటి ప్రమాద ఘటనలు జరుగుతుండటంతో సేఫ్టీ ఆడిట్ ప్రాముఖ్యతపై అధికారులకు



సూచనలు చేశారు. ఫ్యాక్టరీలు, అగ్నిమాపక శాఖ, పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల భద్రతా సంస్థ, కార్మిక శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి సేఫ్టీ ఆడిట్ చేపట్టి భద్రత ప్రమాణాలు, నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరించాలన్నారు.

# శారీరక శ్రమ లేకనే అనారోగ్యం

◆ కంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**సికింద్రాబాద్, మహానాడు:**



సమాజంలో మనిషి జీవన విధానం మారుతోంది... ప్రజలపై తీవ్రమైన పని ఒత్తిడి ఉంది... దీనికి తోడు ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం, నీరు కలుషితం కావడం, పట్టణ ప్రాంతాల్లో శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ కారణంగానే డాక్టర్లు వాకింగ్, వ్యాయామం చెయ్యాలని చెబుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే మంచి జీవన విధానాన్ని అలవాటు చేసుకువాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓపెన్ జిమ్ లను కేంద్ర మంతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట పద్మారావు నగర్ పార్క్ లో ఓపెన్ జిమ్ ను, సికింద్రాబాద్ మెట్టుగూడ డివిజన్ న్యూ మెట్టుగూడ పార్క్ లో ఓపెన్ జిమ్ ను ప్రారంభించారు.

ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వాల ఆలోచన మారాలి... స్కూళ్లలోనే ఆరోగ్యం పై పిల్లకు అవగాహన కల్పించడంతో పాటుగా.. ఆట, పాటలతో మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా చర్యలు తీసుకువాలని మంత్రి సూచించారు.

ఇంకా.. ఏమన్నారంటే.. ప్రస్తుతం స్కూల్ లలో ఆటస్థలాలు లేని పరిస్థితి ఉంది. ఇది భవిష్యత్‌లో చాలా ప్రమాదకరమైన పరిస్థితికి దారితీసే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

ఇప్పటికైనా బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాలను కాపా డుకుని వాటిని ఆటస్థలాలుగా తీర్చిదిద్దుకోవలసిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 40 ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేశాం. జీహెచ్ఎంసీ వద్ద నిధులు లేని కారణంగా ప్రైవేటు వ్యక్తుల ఆర్థిక సాయంతో జిమ్స్ ఏర్పాటు చేయిస్తున్నాం.

ఇంకొన్ని చోట్ల కూడా ఏర్పాటు చేయిస్తాం. ప్రజల ఆరోగ్యం కాపాడ్డానికి ఈ జిమ్ లు ఎంతో ఉపయోగపడుతాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని బహిరంగ ప్రదేశాలను పార్కులుగా మార్చి జిమ్ లను ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

మరోవైపు హైదరాబాద్ సిటీలో ప్రభుత్వం తరపున నిర్వహించే పబ్లిక్ టాయిలెట్లు సరిగ్గా లేవు సులభ్ లాంటి సంస్థల నిర్వహణ లో బాగానే నడుస్తున్న ప్రభుత్వమే చొరవ తీసుకుని ఎన్జీఓలకు కూడా ఆ బాధ్యత అప్పగించాలి. ఎన్జీఓలు ప్రైవేటుగా టాయిలెట్లు నిర్మించి నిర్వహించే విధంగా ప్రభుత్వం సహకరించాలి... ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.. తగినన్ని పబ్లిక్ టాయిలెట్లు లేని కారణంగా రోడ్డుపక్కన, పరిసరాలను వాడుకుంటున్న కారణంగా వాతావరణం అనారోగ్యంగా మారుతోందన్నారు.

# గతంలో సీఎంను కలవాలంటే గగనం



- నేడు సీఎం, మంత్రులను ప్రజలు స్వయంగా కలుస్తున్నారు..
- గత అరాచక పాలన.. నేటి ప్రజా పాలనకు తేడా గమనించాలి
- ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం
- వచ్చిన అర్జీదారులు చిరునవ్వుతో తిరిగి వెళ్లేలా చూస్తున్నాం
- మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి కెఎస్ జవహర్

**మంగళగిరి, మహానాడు:**

తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణలో భాగంగా మాజీ మంత్రి కెఎస్ జవహర్, మహిళా నేత ఆచంట సునీతలతో కలిపి బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. భూ వివాదాలపై పెద్ద ఎత్తున అర్జీలు రాగ.. వెనువెంటనే సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను అక్కడికక్కడే మంత్రి పరిష్కరించారు.

మరికొన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాటితో పాటు పలు అర్జీలను ఆయా శాఖలకు పంపి విచారణ అనంతరం పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

- కర్నూలు జిల్లా కర్నూలుకు చెందిన పలువురు బాధితులు తాము స్థలాన్ని లీజుకు తీసుకొని నిర్మాణాలు చేపడితే... నాటి వైసీపీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ రూ. 50 లక్షలు లంచం తీసుకొని తాము చేపట్టిన నిర్మాణాలను కూల్చి వేయించాడని.. వైసీపీ నేతల చర్యల వలన తాము తీవ్రంగా నష్టపోయామని పలువురు బాధితులు నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అక్రమ కూల్చివేతలపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరారు.
- అనంపురం జిల్లా సొమ అందెపల్లి మండలం పోలేపల్లికి చెందిన యలవ బుద్దప్ప విజ్ఞప్తి చేస్తూ.. తమ ఊరిలో పేదలకు చెందిన 450 ఎకరాలను వైసీపీ నేత నరసింహులు కబ్జాచేసి కంచె వేశారని.. పొలం దగ్గరకు వెళితే పోలీసులతో కొట్టిస్తున్నారని... వారి వలన 28 కుటుంబాలు బాధింప పడుతున్నాయని.. తమకు న్యాయం చేయాలని విన్నవించుకొన్నాడు.
- ఆమెది పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం



భీమవరమని.. వాళ్లకు నరసాపురం మండలం లింగబోయన చర్ల గ్రామ పంచాయతీ రామకూరిపాలెం గ్రామంలో కొంత భూమి ఉంటే మాజీ ఎమ్మెల్యే ముదునూరి అనుచరులు దాన్ని కబ్జా చేసేందుకు కుట్రపన్నారని.. అన్ని ఆధారాలు ఉన్నా కాని.. సర్వేకి అప్లై చేస్తే నాడు రెవెన్యూ అధికారులు చాలా సార్లు రిజెక్ట్ చేశారని రెవెన్యూ అధికారుల తీరువలన తాము తీవ్రంగా నష్టపోయామని ఆమె ఆవేదన చెందారు. గత వైసీపీ ఎమ్మెల్యేకు తొత్తులుగా పనిచేసిన అధికారులపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని బాధితురాలు చామకూరి కుసుమ కుమారి పద్మావతి కోరారు.



- ఎన్టీఆర్ జిల్లా ఏ. కొండూరు మండలం తూర్పు మాధవరం గ్రామానికి చెందిన పూల పుష్పావతి విజ్ఞప్తి చేస్తూ.. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే కారణంగా తమ భూమిని తక్కువ చేసి ఆన్ లైన్ లో ఎక్కించారని అసలు భూమి 1 ఎకరా 37 సెంట్లు ఉంటే ఎకరా 12 సెంట్లు ఎక్కించారని.. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. వారి భూమిని ఆన్ లైన్ లో ఎక్కించడానికి గ్రామ సర్వేయర్ రమేష్ లంచం తీసుకున్నారని, ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఆకు తోట లక్ష్మీనరసింహారావు కూడా విజ్ఞప్తి చేస్తూ గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తమ భూమిని కూడా తగ్గించి ఆన్ లైన్ చేశారని.. అధికారులకు మొరపెట్టున్నా వినడంలేదని.. దయ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.
- ఏలూరు జిల్లా పోలవరానికి చెందిన ఎండపు విఙ్ఞేశ్వరి విజ్ఞప్తి చేస్తూ.. చంద్రగూడెంలో తన భర్త తాతగారు కొన్న భూమిలోకి వెళ్లకుండా.. తమను కొంతమంది గిరిజనులు సాగు చేసుకొంటున్న భూమిలోకి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు.
- తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తుపాకుల గూడెం గ్రామానికి చెందిన వుండవల్లి వెంకటలక్ష్మి విజ్ఞప్తి చేస్తూ.. గత 50 ఏళ్ల నుండి నేటికి బయ్యవరం గ్రామంలో 2 ఎకరాల 50 సెంట్ల భూమి తన స్వాధీనంలో ఉందని.. వాస్తవానికి విరుద్దంగా తళ్లపూడి రెవెన్యూ అధికారి ఎన్‌వీఎన్‌కే ప్రసాద్ ఆ భూమి మరోకరిదిగా చెబుతున్నారని.. వాస్తవాలను పరిశీలించిన తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.
- పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన గుమ్మళ్ల బ్రహ్మయ్య విజ్ఞప్తి చేస్తూ.. వంశపారపర్యంగా తమకు వచ్చిన భూమిలోకి తమను వెళ్లకుండా బెదిరిస్తున్నారని.. భూమిని సాగు చేసుకోనివ్వడం లేదని... దీనిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. తగిన విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.
- కోర్టు ఉత్తర్వులు ఉన్నా... బోగస్ పత్రాలు సృష్టించి తమ



అడ్డుకుంటున్నారని... దీనిపై అధికారులు చుట్టా తిరగినా పట్టించుకోవడంలేదని.. వైసీపీ నాయకులు దీని వెనుక ఉండి నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆ పొలమే ఆధారమని. తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.
- గత 21 ఏళ్ళుగా తమ సాగులో ఉన్న భూమికి దొంగ పట్టాలు సృష్టించి తమ భూమిని కొట్టేయడానికి గుదె సుబ్బారావు, మిట్టా తిరుపతయ్యలు యత్నిస్తున్నారని.. కనిగిరి మండలం చల్లగిరిగల గ్రామానికి చెందిన వీరనారాయణమ్మ గ్రీవెన్స్ లో మంత్రికి ఫిర్యాదు చేశారు.



భూమి 3 ఎకరాల 4 సెంట్లను కబ్జాచేసి కట్టడాలు ప్రారంభించారని.. ఈ భూ కబ్జా అక్రమ కట్టడాలపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని అనంతపురం జిల్లా కదిరికి చెందిన కె. సికిందర్ గ్రీవెన్స్ లో కోరారు.
- విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కోనాడలో పలువురు వైసీపీ నేతలు పభుత్వ భూములను ఆక్రమించుకొని రేకుల షేడ్ లు వేశారని.. అంతేకాకుండా శ్మశాన స్థలాన్ని కబ్జా చేసి రొయ్యల చెరువులు తవ్వారని.. ఈ ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాసుపల్లి దినేష్ నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 750 గ్రామాల ప్రజలకు మంచినీటిని అందించే సత్యసాయి ప్రాజెక్ట్ ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని... ప్రాజెక్ట్ ను నిర్వీర్యం చేసి గ్రామాల్లో ప్రజలు నీటికి ఇబ్బందులు పడేలా చేశారని అంతే కాకుండా.. టీడీపీ ప్రభుత్వంలో ప్రాజెక్ట్ నిర్వహణకు ఉన్న రూ. 2 కోట్ల 30 లక్షలను రూ. 1 కోటి 20 లక్షలకు తగ్గించిందని.. దాంతో ప్రాజెక్ట్ మెయింటెన్స్ సక్రమంగా లేదని గత ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు కూడా ఇవ్వడంలేదని తెలిపారు. గత ఏడు నెలల నుండి పీఎఫ్, ఈఎస్ఐసీలు కార్మికుల ఖాతాలకు చెల్లించడంలేదని... దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్సీ, డీఈలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. తమ సమస్యను పట్టించుకొని తమకు న్యాయం చేయాలని సత్యసాయి కార్మికులు ఫిర్యాదు చేశారు.
- జి. ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి తనకు మాయ మాటలు చెప్పి తన నుండి రూ. 25 లక్షలు కాజేశాడని.. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని తిరుపతికి చెందిన పి.గౌతమ్ ఫిర్యాదు చేశారు. అతని నుండి డబ్బులు ఇప్పించాలని వేడుకున్నారు.
- మదనపల్లి నియోజకవర్గం నిమ్మనపల్లి మండలానికి చెందిన పారపట్ల రమణప్ప విజ్ఞప్తి చేస్తూ.. మత్స్యకార సంఘ సభ్యులకు వలలు, బోట్ లు, ఐస్ బాక్స్ లు, చేప పిల్లలు, మోటార్ వాహనాలు సబ్సీడీ కింద ఇవ్వాలని గ్రీవెన్స్‌లో మంత్రి, నేతలకు విజ్ఞప్తి చేశాడు.
- నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ఐదేళ్లలో జగన్ రెడ్డి ప్రభుత్వంలోని అరాచకాలను, అన్ని ఇబ్బందులను తొలగించడానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షించ తగిన విషయమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. నేడు సీఎం నుండి మంత్రులు, నేతలందరూ ప్రజలందరికి అందుబాటులో ఉంటున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ఇది పేదల ప్రభుత్వమని నిరూపించారు. గత ఐదేళ్లలో భూ దోపిడీలు. ల్యాండ్



టైటిలింగ్ యాక్ట్ పేరుతో ఆన్ లైన్ లో పేర్లు మార్చి గత పాలకులు ప్రజలను ఇబ్బంది పెట్టారు. వాటి పరిష్కారానికి వచ్చే నెల నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. భూ సమస్యలతో పాటు పింఛన్, రేషన్ కార్డు సమస్యల్లాంటి అనేక ఇష్యూలు వచ్చాయి. వచ్చిన ప్రతి అర్జీదారునికి న్యాయం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే మా నాయకుడు లక్ష్యం.. దానికి తగినట్టు ప్రజలకోసం మేం పనిచేస్తున్నాం.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 22, ఆగస్టు 2024

# కాకినాడ కథ కమామీషు!

**కాకినాడ మా ఊరండి... ఆ పేరు వినగానే మనసంతా ఏదో అయిపోతుంది.**

**జగన్నాథపురం బ్రిడ్జి దాటగానే మన కాకినాడ పాత జ్ఞాపకాలు ఒక్కసారి సినిమా రీళ్ళులా గిర్రున తిరుగుతాయి.**

**అప్పట్లో అలా ఉండేది. ఎప్పుడో విదేశీయులు కాకినాడ వచ్చి కోకల వ్యాపారం మొదలుపెట్టారుట.**

**వ్యాపారం అంటే చీరలు అమ్మడం కాదు. చీరలు ఎగుమతి.**

**చుట్టూ విశాలమైన బంగాళాఖాతం ఉండగా చేపలు పట్టడం మానేసి కాకినాడలో ఈ కోకల వ్యాపారం ఎందుకు ఎంచుకున్నారో ఆ విదేశీయులు డచ్ వారు. అప్పటినుంచి కాకి నందివాడ కోకనాడగా మారి పోయింది. ఇప్పటికీ రైల్వే డిపార్ట్మెంటవారు కోకనాడ పేరుమర్చిపోలేదు. అది అలాగే కంటిన్యూ అవుతోంది. ఆ విదేశీయుల నామకరణం వాడుకలో కాకినాడగా మారిపోయింది.**

కోకనాడ అతి పురాతన నగరం. తూర్పున బంగాళాఖాతం ఓడరేవుగా మారి ఎగుమతులకు సహాయం చేస్తూ మధ్యలోనీ హోప్ ఐలాండ్ నగరాన్ని ముంపు నుండి కాపాడుతోంది.

అందాల నగరం లోపల అందమైన రోడ్లు, మంచి పార్కులు, మంచి కాలేజీలు, మంచి స్కూల్స్ ఎన్ని ఉండేవో.

అప్పట్లో కాలేజ్ అంటే గుర్తుకొచ్చింది పీఆర్ కాలేజ్ అండి. ఈ కాలేజీలో చదువుకుని ఎంతోమంది కలెక్టర్లు, డాక్టర్లు, నాయకులు, ఇంజనీర్లు, యాక్టర్లు అయిపోయారు.

కాకినాడ ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేని ఒక మహా వ్యక్తి




పిఠాపురం మహారాజువారు... శ్రీ రాజారావు వెంకట మహిపతి గంగాధర రామారావు గారు. ఈ మహారాజా వారు 1884 లోనే ఒక స్కూలు స్థాపించి దాన్ని కాలేజీగా మార్చి ఎంతో మందికి విద్యను అందించారు. అదే పీఆర్ గవర్నమెంట్ కాలేజ్.

ఈనాటి కూడా అది అత్యున్నత ప్రతిష్ఠాకరమైన కళాశాల. ఈ నగరంలో రంగరాయ మెడికల్ కాలేజీ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలకు కూడా స్థలదాత పిఠాపురం మహారాజు వారే. అలాగే జగన్నాథపురంలోని మల్లాడి సత్య లింగం నాయకర్ గారి కళాశాల నాయకర్ గారి భిక్ష.

ఏ రాజుల ఏలుబడిలో ఈ నగరం ఉండేదో తెలియదు గాని రెండో ప్రపంచ యుద్ధంలో బాంబు మటుకు కాకినాడ మీద వేశారుట. భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం ఈ నగరంలో జరగడం ఒక చారిత్రాత్మక విషయం. బ్రిటిష్ వారి కట్టడాలు కొన్ని ఈనాటి కూడా ఈ నగరంలో చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఉదాహరణకి కలెక్టర్ కార్యాలయం.

అతి సామాన్యుడి నుంచి ధనవంతుడి వరకు అందరూ హాయిగా బతకగలిగే ఈ నగరాన్ని ఒకప్పుడు పెన్షనర్స్ పారడైజ్




అనే వారు.

ఊరి మొదట్లో ఒక బోధన ఆసుపత్రి, పిఠాపురం రాజు గారి కాలేజీ, మెక్లారిన్ హై స్కూలు, ఒక ఇంజనీరింగ్ కాలేజీ, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, రామారావు పేట, గాంధీ నగరం లో అందమైన పెంకుటిళ్లు సుబ్బయ్య గారి హోటల్, కోటయ్య గారి కాజా, విశాలమైన సముద్రం, త్రిపుర సుందర గుడి, భానుగుడి, నూకాలమ్మ గుడి, రమణయ్యపేట కూరగాయ మార్కెట్, సర్పవరం పూల మార్కెట్, రోజు ఇత్తడి బిందెల తోటి పాలు అమ్మే వ్యాపారులు, ఇంటి ముందర పాలు పిండే వ్యాపారులు, పొట్టి పెసరట్టు, గాంధీ పార్క్ఇన్ని ఆకర్షణలతో ఇలా సుందర నగరంలా ఉండేది.

ఒకే వీధిలో సినిమా హాళ్లు, ఒక వీధిలో బట్టల షాపులు సమస్తం అందులోనే దొరికేవి. ఎటు చూసినా ఎనిమిది కిలోమీటర్ల వ్యాసార్థంతో నగరం ఉండి ట్రాఫిక్ సమస్యలు అన్నమాట లేక రిక్షాలోనే ప్రయాణం. కార్లు, బస్సులు, ఆర్టీసీ వారి బస్సులు ఉన్నా వాహన కాలుష్యం లేక ఎంత ఆనందంగా ఉండేది నగర జీవనం. సర్కార్ ఎక్స్ప్రెస్, గౌతమి ఎక్స్ప్రెస్, ఒకటో రెండో ప్యాసింజర్ రైళ్లు తప్ప ఇంకేమున్నాయి మనకి. సగటు మనిషి కూడా సరదాగా బతికేసే రోజులు అవి.

చుట్టూ విశాలమైన ఖాళీ ప్రదేశాలు, మామిడి తోటలు, పనస చెట్లు, గట్టిగా వర్షం వస్తే మునిగిపోయే ప్రదేశాలు. స్థలాలు కొనుక్కోమని బతిమాలుతుండేవారు. ఎవరి దగ్గర ఉన్నాయి డబ్బులు?

అప్పట్లో కాకినాడ నగరమే గాని తెల్లవారితే పల్లెటూరు అంతా కాకినాడలోనే ఉండేది. పొద్దున్నే ఎర్రబస్సు ఎక్కి కాకినాడ వచ్చిఉదయం శాంతిభవన్లో టిఫిన్ చేసి, మధ్యాహ్నం సుబ్బయ్య గారినిపలకరించి, సాయంత్రం కూడా బజార్లో కుమార్ బిస్కెట్లు కొనుక్కుని పని చూసుకుని సాయంత్రానికి ఇంటి చేరేది.



అలాగే రోజు వచ్చే పోయే జనంతో బిజీ బిజీగా ఉండేది. సాయంత్రం పూట చల్లటి గాలి... ప్రాణం హాయిగా ఉండేది. బజారు కెళ్ళి హాయిగా పని చూసుకుని ఇంటికి వస్తే ఎంతో ఆనందంగా ఉండేది.

అటు పల్లెటూరు కాదు ఇటు పట్నం కాకుండా ఉండే కాకినాడ వాతావరణం. పది కాలాలపాటు ఈ ఊర్లోనే ఉండాలి రా బాబు అనుకుని ట్రాన్స్ఫర్ వచ్చిన పిల్లల్ని ఎక్కడకి కదపకూడదు అంటూ పక్క ఊర్లకు, రోజూ విశాఖపట్నం వరకు ప్యాసింజర్ రైలు ఎక్కి ఉద్యోగం చేసి సాయంకాలం కాకినాడ చేరి హాయిగా ఊపిరి పీల్చుకునే స్నేహితులు ఎంతోమంది.

ఎప్పుడైనా విశాఖపట్నం ఫాస్ట్ పాసింజర్ రైలు ఎక్కితే దారి పొడుగునా చేతిలో ఒక క్యారేజీతో కనబడే స్నేహితులు చాలా మంది. అంటే ఆ రోజుల్లో కాకినాడ నుండి మకాం మార్చడానికి ఎవరు ఇష్టపడేవారు కాదు. సొంతిల్లు లేకపోయినా సామాన్యుడుకి అందుబాటులో ఉండేవి ఇంటి అద్దెలు. సినిమాల్లో చూపించినట్లు ఉండేవారు కాదు ఇంటి యజమానులు.

ఎంతో ఆప్యాయంగా ఎంతో అభిమానంగా ప్రేమగా ఉండే వారు. అద్దె ఒక రోజు లేట్ అయినా ఏమి అనుకునేవారు కాదు. సహాయం అంటే ఎవరైనా ముందుకు వచ్చేవారు. ఇక పిల్లలు చదువులు కూడా కార్పొరేట్ కళాశాలలు స్కూళ్లు చాలా చాలా తక్కువ. ఒక మాదిరి కాన్వెంట్లో లేదా గవర్నమెంట్ స్కూలు, కాలేజీల విద్య సామాన్యుడు కూడా చాలా అందుబాటులో ఉండేది.

పెద్ద బజార్లో కిరాణా షాపులు సామాన్యుడుకి అందు బాటులో ఉండే ధరలతో సరుకులు అమ్మేవి. రమణయ్యపేట కూరగాయల మార్కెట్, గాంధీనగర్ మార్కెట్ ఆదివారం పూట కిటకిటలాడుతు ఉండేది. తాజా కూరగాయలు రేట్లు తక్కువ.

ఉదయం 5 గంటల నుంచి ప్రక్కనుండే పల్లెటూరు నుంచి సైకిల్ మీద కూరగాయలు తట్టలో పెట్టుకుని వీధి వీధి తిరిగి అమ్మే కూరగాయలు వారు కోకొల్లలు. అరువు రేపు అనే బోర్డు ఉండేది కాదు వీరి దగ్గర. నెలాఖరులో కూడా డబ్బు తీసుకునే వాళ్ళు! మరి సరుకు తాజా. ఎందుకంటే కాకినాడ చుట్టుపక్కల ఉండే గ్రామాల్లో అన్ని కూరగాయలు పండించేవారు. చిత్రాడ బీరకాయలు ఎవరు మర్చిపోతాం.

వర్షాకాలం వస్తే కూరగాయల విత్తనాలు వంగ నారు బాలాజీ చెరువు సెంటర్ లో దొరికేవి.

తెల్లవారుగానే కాఫీ పడకపోతే ఎవరికి తోచదు. ఉదయం ఐదు గంటలకు వీధి గుమ్మం తలుపు తీస్తే ఎదురుగా సైకిల్ మీద ఇత్తడి బిందె లతో పాలు పెట్టుకుని ప్రతి ఇంటికి వచ్చి పాలు పోసేవాడు. కావాలనుకుంటే నాలుగు గేదెలతో వచ్చేవాడు. ఇంటి ముందే పాలు పితికి తన నిజాయితీని ప్రతిరోజు ప్రదర్శిస్తూ ఉండేవాడు పాలవాడు. ఆ వాతావరణం మన గ్రామీణ వాతావరణం తలపించి ఉండేది. ఉదయమే ప్రశాంతంగా ఉండేది.

నగరంలో ఆఫీసులకు చేరాలంటే బస్సు ఎక్కక్కర్లేదు ట్రైన్ లెక్కకర్లేదు రిక్షాలు, స్కూటర్లు నగరంలో తిరిగే సిటీ బస్సులు సామాన్యుడు కూడా చాలా అందుబాటులో ఉండేవి. ఇంటిదగ్గర భోజనం చేసి తాంబూలం వేసుకుని చక్కగా ఆఫీస్ సీట్లో కూర్చుని మధ్యాహ్నం లంచ్ బాక్స్ స్నేహితులతో పంచుకొని సాయంకాలం 6:00 కాగానే ఇంటికి చేరి స్నానం చేసి లుంగీ లేదా పంచ కట్టుకుని రేడియోలో వార్తలు పెట్టుకుని వాలు కుర్చీలో పడుకుని సేదదీరేవాడు సగటు ఉద్యోగి. ఉద్యోగి కూడా ఒత్తిడి ఫీలయ్యే వాడు కాదు.

ఎవరికైనా అనుకోకుండా రోగం వస్తే జిల్లాలోనే అతి పెద్దదైన రంగరాయ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స సామాన్యుడికి చాలా అందు బాటులో ఉండేది. నిష్ణాతులైన వైద్యులు ఆ ప్రభుత్వాసుపత్రిలో ఉండేవారు. డాక్టర్‌కి రోగికి ఉండే సంబంధం ఒక తల్లికి బిడ్డకు ఉండే సంబంధంలా ఉండేది. అందులో పని చేసే వైద్యులు అనుభవజ్ఞులే కాకుండా ధర్మబద్ధంగా ఉండేవారు.

పిల్లలు స్కూల్‌కి రిక్షాలో వెళ్లేవారు. ఇంటింటికి రిక్షావాడు టైంకి వచ్చి పిల్లల్ని ఎక్కించుకుని జాగ్రత్తగా స్కూల్ దగ్గర దింపి మళ్లీ టైం కి స్కూల్ నుంచి తిరిగి తీసుకొచ్చేవాడు. రిక్షావాళ్లు చాలా నమ్మకంగా ఉండేవారు.

రోడ్డు మీద కూడా స్త్రీలు నిర్భయంగా తిరగడానికి ఏవి ఇబ్బంది ఉండేది కాదు. ఆకతాయిమూక ఎక్కడో తప్పితే కాకినాడలో లేదు. అటువంటి సంఘటనలు ఏమీ లేవు. ప్రజ




లందరూ ఆప్యాయత అభిమానాలతో కలిసిమెలిసి ఉండేవారు. మనకి పల్లెటూర్లో ఉండే వాతావరణం ఇక్కడ కనిపించేది.

వినాయక చవితి, దసరా ఉత్సవాలు ప్రతివీధిలోను జరుగుతూ ఉండేవి. రాత్రిపూట సినిమాలు రోడ్డు మీద వేసేవారు. రికార్డింగ్ డాన్సులు, కోలాటాలు, హరికథలు, బుర్రకథలు అబ్బో ఆ సందడే వేరు.

ఇక సూర్య కళామందిర్లోను సరస్వతి గాన సభలోను సంగీతం జరుగుతూ ఉండేవి. ఆనందభారతిలో మీటింగులు చెప్పక్కర్లేదు

అలాంటి మా కాకినాడ అమాంతం ఆకాశం అంత ఎత్తుకు ఎగిరిపోయింది. ఉప్పు పండే భూముల్లో మహా సౌధాలు లేచాయి. ఒకప్పుడు చుట్టుపక్కల ఉండే ఊరిలో ఉండే భూములన్ని రేట్లు అమాంతం పెరిగిపోయాయి. అపార్ట్మెంట్ కల్చర్ పెరిగి పోయింది. పెంకుటిల్లు మచ్చుకి కూడా కనబడట్లేదు. షాపింగ్ కాంప్లెక్స్ లెక్కలేదు. ట్రాఫిక్ విపరీతంగా పెరిగి రాత్రి పగలు తేడా లేకుండా జనం తిరుగుతూనే ఉన్నారు.

కాకినాడ నుంచి ఏ మూలకైనా బస్సులు. ట్రైన్లు కూడా గణనీయంగా పెరిగేయి. ఇక ప్రైవేట్ బస్సులు అయితే చెప్పక్కర్లేదు. సాయంకాలం 5 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు హైదరాబాద్ కి లెక్క లేనన్ని ప్రైవేటు బస్సులు.

ఎక్కడైనా ఈ రోడ్డు నుంచి ఆ రోడ్డుమీదకి దాటాలంటే చాలా ఆలోచించి అడుగేయాలి. లేకపోతే ఆసుపత్రిలో ఉండాలి.

మామూలుగా ఉండే కిరాణా షాపులు మాట అలా ఉంచి కార్పొరేట్ స్థాయిలో సూపర్ మార్కెట్ విపరీతంగా పెరిగాయి. ఇక్కడ ఉప్పు మొదలుకొని ఒక కుటుంబానికి కావాల్సిన కిరణా సామగ్రి, బట్టలు, స్టీల్ సామాన్లు, కూరగాయలు, ఫర్నిచర్ కూడా దొరుకుతుంది. ఏ సూపర్ మార్కెట్ చూసిన ఎప్పుడూ కిటకిటలాడుతూనే ఉంటాయి.

అవి కాకుండా పెద్ద బజారులో కిరాణాషాపులు యథా విధిగా నడుస్తున్నాయి. ఎంతమంది జనాలు. మెయిన్ రోడ్‌లో షాపులన్నీ కిటకిటలాడుతూ ఉంటాయి.

మామూలుగా ఉండే బంగారం షాపులు అవి యథావిధిగా నడుస్తున్న కార్పొరేట్ సంస్థల చేత స్థాపించబడిన బంగారం షాపులను చూస్తే మతిపోతోంది.

ఇక బట్టల షాపులు షాపింగ్ మాల్స్‌లో బట్టలు సూపర్ బజార్లో బట్టలు అది కాకుండా ఏసీ షోరూంలు, రెడీమేడ్ బట్టల షాపులు, సంత మార్కెట్ దగ్గర బట్టల షాపులు ఆది వారం మార్కెట్ మెయిన్ రోడ్‌లో బట్టలు ఇవి ఎప్పుడూ ఖాళీ ఉండటం లేదు ఇదివరకు పండగ రోజుల్లో బట్టలు కొనుక్కునేవారు. ఇప్పుడు అలా కాదు కార్డులు గీకేసి సరుకు తెచ్చుకుని ఇంట్లో పడేస్తున్నారు.

కాకినాడలో లేని బ్యాంకు లేదు. ఇక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలైతే చెప్పలేనన్ని ఉన్నాయి. మార్వాడీలు రోజువారీ ఫైనాన్స్ చేసే సంస్థలు బాగా పెరిగిపోయాయి. బ్యాంక్ అకౌంట్ అంటే ఇదివరకు అందరికీ ఉండేది కాదు. గవర్నమెంట్ స్కీంల పుణ్యమా అని ఏ ఒక్కరు ఎకౌంటు లేకుండా లేరు. ఏటీఎం కార్డులు క్రెడిట్ కార్డులు లేనివాడు ఎవడు లేడు. కార్డులు వాడకం విపరీతంగా పెరిగిపోయింది. ఒక క్షణం షాప్ దగ్గర కూర్చుంటే జేబులో నుంచి డబ్బులు తీసేవాడు ఎవడు లేడు. అందరూ స్వైపింగ్ లే. ఎంత డెవలప్ అయిపోయింది నగరం. ఆటో నడుపుకొనే అతి సామాన్యుడు కూడా క్రెడిట్ కార్డ్ కార్డు గురించి మాట్లాడేస్తున్నాడు. ఏ వేళైనా డబ్బులు తీసుకోవడానికి కాకినాడలో ప్రతి అడుగుకి ఏటీఎంలే.

ఒక మామూలుగా భోజనం హోటల్ సంగతి చెప్పక్కర్లేదు. సుబ్బయ్య గారు యథావిధిగా అయ్యర్ హోటల్ సరే సరి. చిన్న పెద్ద హోటల్స్ క్యాటరింగ్ చేసే వాళ్లు పొద్దున సాయంకాలం తోపుడుబండ్ల మీద టిఫిన్ సెంటర్లు. ఇలా ప్రతి చోట తినుబండారాలే. పెద్ద హోటల్స్ నిర్వహించే భోజనశాలలు చెప్పక్కర్లేదు.

ఫోన్ పే.. గూగుల్ పే ఏ ముహూర్తాన్ని అడుగు పెట్టాయో గానీ ప్రతి టిఫిన్ సెంటర్లో ఫోన్ పేలు గూగుల్ పే లే. కాగితం రూపాయలు ఇవ్వక్కర్లేదు. కాగితం రూపాయలతోటి చిల్లర సమస్య. ఇలా పెరిగిపోయిందండి. స్విగ్గిలు, జోమాటోలు క్షణాల్లో కావాల్సిన చోట కావాల్సిన తినుబండారాలు తెచ్చి పడేస్తున్నాయి. చుట్టాలొస్తే కష్టపడి వంట అక్కర్లేదు. బుజ్జిగాడు సెల్ ఓపెన్ చేసి కొట్టేస్తున్నాడు. ఏం ఫాస్ట్‌గా ఇస్తున్నాయండీ సర్వీసు.

ఇలా బుజ్జిగాడు ఆర్డర్ ఇచ్చాడో లేదో అలా మెసేజ్ మీద మెసేజ్లు... ఇంతలో కాలింగ్ బెల్ మోగుతుంది. అడ్రస్ తెలియకపోతే ఫోన్లో లొకేషన్ షేర్ చేసేస్తాడు చంటిగాడు. అంతా మరీ ఈజీ అయిపోయింది అండి. మరి మాకు కాకినాడ ఇలా అయిపోయింది ఏమిటా అని మా తరం వాళ్ళు తెగ సంతోష పడిపోతున్నాం.

ఎందుకంటే కష్టాలన్నీ మేమే పడ్డాం. అవునండి అదేదో చెప్పడం మర్చిపోయాను. కొత్తగా బిగ్ బాస్కెట్ ఒకటి వచ్చింది. సరుకు ఇలా ఆర్డర్ ఇచ్చారో లేదో అలా కిరాణా సామాన్లు ఇంటి దగ్గర పడేస్తోంది. ఇంక మంచం దిగక్కర్లేదు. అపోలో ఫార్మసీ వాడితో పాటు మరికొన్ని కార్పొరేట్ సంస్థలు మందులు డోర్ డెలివరీ చేసేస్తున్నాయండి. ఆ బాధ కూడా మనకు లేదు. కిరణాసరకు ఇంటి దగ్గరికి వచ్చేస్తోంది. మందులు ఇంటి దగ్గరికి వచ్చేస్తున్నాయి. డాక్టర్ ఆన్లైన్లో కూడా సంప్రదించవచ్చు. ఆపరేషన్ కోసమే హాస్పిటల్ దగ్గరికి వెళ్ళాలి. బట్టలు ఫ్లిప్‌కార్ట్ వాడు తెచ్చిపడేస్తున్నాడు. ఇంకేముంది బాధ.

కాకినాడలో రైతు బజార్లు ఆదివారం వస్తే కిటకిటలాడుతూ ఉంటాయి. ఇక కూరగాయలు మామూలుగా మార్కెట్లో లోను సూపర్ బజార్లోను కిరాణా షాపుల్లోనూ కిళ్లీ షాపుల్లోనూ కూడా దొరుకుతున్నాయి.

ఓ.. ఇక స్కూళ్లు చెప్పక్కర్లేదు కార్పొరేట్ స్కూల్ లన్ని కాకినాడ వచ్చేసేయ్. కొత్త పేర్లు. అవి ఎప్పుడు పెట్టారో.. అవి ఎక్కడ ఉన్నాయి కూడా తెలియటం లేదు. పిల్లల్ని తీసుకెళ్లే రిక్షా టైర్లు పంచరైపోయాయి. ఆటోలు, కొత్త కొత్త బస్సు లు రోడ్లు ఎక్కడా ఖాళీ ఉండటం లేదు. కానీ పిల్లల సాయంకాలం ఇంటికి వచ్చేంత వరకు బెంగగా ఉంటుంది. ట్రాఫిక్ కదండీ.

ఇంజనీరింగ్ కాలేజీలు చెప్ప అక్కర్లేదు. ఊరికి దూరంగా ఉండి ఇంజనీర్లు తయారు చేసేస్తున్నాయి. ఎవరికి ఆంధ్ర ప్రదేశ్ లో ఉద్యోగాలు లేక బస్సు ఎక్కి తెలంగాణ రాజధానికి వెళ్లిపోతున్నారు. నిరుద్యోగులు ఎవరు కాకినాడలో కనబడలేదు. అంతా హైదరాబాద్. చదువు కాకినాడలో సంపాదన






హైదరాబాదులో.

అప్పట్లో రాందాస్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వాళ్ళు సరుకు మాత్రమే రవాణా చేసేవారు. ఈ మధ్య షాపింగ్ మాల్ కట్టేసి ప్రజలందరినీ అక్కడే కట్టి పడేస్తున్నారు అండి. షాపింగ్ మాల్ చూడవలసిందే. మనం కాకినాడలో ఉన్నామా సింగపూర్‌లో ఉన్నామా ఒకసారి భలే డౌట్ వచ్చేస్తుందండి. ఇంకా అపార్ట్మెంట్లు కూడా భలేగా కట్టేసారండి. అపార్ట్మెంట్ అంటే ఎవడు వచ్చేవారు కాదు. ఇప్పుడు కోటి రూపాయల అపార్ట్మెంట్ కొనడానికి లైన్‌లో ఉంటున్నారు. మా చెడ్డ అపార్ట్మెంట్లు కట్టేశారు లెండి. అబ్బ మతిపోతోందండి. ఒక్కసారి దారి కూడా మర్చిపోతున్నాం. ఏ వీధిలో ఉన్న గుర్తు ఉండటం లేదు.

అప్పట్లో కోటయ్య గారు ఒకరే కాజా తయారు చేసేవారు. ఇప్పుడు కాజా షాపులు, పూతరేకులు షాపులు, తినుబండారాల



షాపులు, అబ్బా ఆ బొమ్మలు చూస్తుంటే నోరూరు పోతోందండి. ఇక దేవాలయం వీధిలో పెసరట్టు మామూలే. గాంధీనగర్ దగ్గర భాషా బాయి మామూలే. సాయంకాలం జేబులో కార్డులు పెట్టుకుని మెయిన్ రోడ్‌లో నడిచే వెళ్తుంటే రాత్రి ఇంటికి వచ్చి మంచి నీళ్లు తాగి పడుకోవచ్చు. అబ్బబ్బ స్వీట్లు హోట్లు మిర్చి బజ్జీలు, పకోడీలు, బొండాలు కొన్ని పేర్లు తిరగటం లేదండి. అప్పట్లో మా నాన్నగారు మెయిన్ రోడ్ నుంచి మిర్చి బజ్జి. ఆ బజ్జీయే చూడలేదు మళ్ళీ. ఏం చెప్పను ఏం చెప్పను కొత్త రుచులన్నీ తినిపించేస్తుంది కాకినాడ.

ఇవన్నీ తినేసి కడుపునొప్పి అనో కాలు నొప్పి అనో చక్కెర వ్యాధి అనో డాక్టర్ గారి దగ్గరికి వెళ్దాం అంటే అన్ని రకాల స్పెషలిస్టులు కాకినాడలోనే ఉన్నారండి. ఎన్ని మెడకల్ షాపులు, ఎన్ని రక్త పరీక్ష కేంద్రాలు... అబ్బబ్బ రోగం వచ్చిందని భయం లేదు. అటు చూస్తే అపోలో ఇటు చూస్తే ట్రస్ట్ ఆసుపత్రి గుండె నొప్పికి మా పెద్ద ఆసుపత్రులండి కాకినాడలో. కంటి ఆసుపత్రి లెక్కలేదు. బస్సులతో జనాన్ని ఎక్కించుకుని ఆపరేషన్ చేసేస్తున్నారు. బాగా డెవలప్ అయిపోయింది అండి కాకినాడ.

అప్పట్లో చొల్లంగి అమావాస్యకి సముద్ర స్నానం చేసే వాళ్ళం అండి. ఇప్పుడు చుట్టాలు వస్తే మా బీచ్ చూపించడానికి రోజు సముద్రం ఒడ్డునే ఉంటున్నాం అండి. మాకు ఉప్పాడ ఒకటి, కాకినాడ ఒకటి కాదండి. ఈ చివరి నుంచి ఆ చివరికి ఏం జనం ఏం జనం. సెలవు వచ్చే జనాన్ని చూసి కాల క్షేపం చేసేయొచ్చు. అదేదో సినిమా తీశారండి. అప్పటినుంచి ఉప్పాడ బీచ్ మరీ పెరిగిపోయింది.

హైదరాబాద్ నుండి కారు వేసుకుని చుట్టాలు ఉప్పాడ పట్టు చీరలు కొనుక్కోవడానికి వచ్చేస్తున్నారు. పక్కనున్న కాకినాడ వాళ్ళు ఉప్పాడపట్టు చీర మెయిన్ రోడ్‌లో కొనుక్కుంటుంటే హైదరాబాదులో తెలంగాణ వాళ్లు తెగతెగ వచ్చేస్తున్నారండి బాబు. చేతిలో కారు ఉంది. గుప్పెట్లో మొగుడు ఉన్నాడు. పర్సులో కార్డు ఉంది. మనకి ఏంటి లోటు. నాలుగైదు పట్టు చీరలు మంచివి తీసుకుని భలే మంచి చౌక బేరం అనుకుని ఆనంద పడిపోయి చీరల షాప్‌ని వాట్సాప్‌లో పక్కింటి ఆవిడకి చూపించేసి ఆవిడను కూడా టెంప్ట్ చేసి కాకి నాడ లాక్కొచ్చేస్తున్నారండి బాబు. కాకినాడ కాదు ఉన్నట్టుండి ఉప్పాడ కూడా సముద్రమంత ఎత్తుకు ఎదిగిపోయింది. సముద్రవేమో లోపలికిపోతోంది.

ఆఖరున ఒక విషయం చెప్పడం మర్చిపోయాను.

స్థలాలు చవగ్గా ఇచ్చారు కదా అని కొని పడేసి హైదరాబాద్, బెంగళూరు వెళ్ళిపోతే కబ్జాదారులు ముంచేస్తున్నారండి. ఈ మధ్యన ఇవే ఎక్కువ అయిపోయాయి. కాకినాడ దీంట్లో కూడా ప్రథమ స్థానంలో ఉంది.

కడుపులో చల్ల కదలకుండా ఉండేది కాకినాడలో కాపురం.

ఇప్పుడు అంతా రోజు పరుగుల పందెంలో పాల్గొనడమే.

ఇలా ఉందండి కాకినాడ కథ కమామీషు.

- మధునాపంతుల చిట్టి వెంకట సుబ్బారావు
కాకినాడ- 94917 92279

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 22, ఆగస్టు 2024

# జగన్ విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దు

◆ కోర్టును కోరిన సీబీఐ




హైదరాబాద్,మహానాడు: బ్రిటన్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలన్న వైకాపా అధ్యక్షుడు, అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడు జగన్ పిటిషన్‌పై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఆయన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని కోర్టును సీబీఐ కోరింది. జగన్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. కోర్టు తన నిర్ణయాన్ని ఈ నెల 27కు వాయిదా వేసింది. యూకేలో చదువుతున్న కుమార్తె వద్దకు సెప్టెంబరు మొదటి వారంలో వెళ్లడానికి అనుమతించాలని పిటిషన్‌లో జగన్ కోరారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం సీబీఐ వివరణ కోరుతూ విచారణను బుధవారానికి వాయిదా వేశారు. దీంతో సీబీఐ నేడు వాదనలు వినిపిస్తూ జగన్ బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని కోర్టును కోరింది.




# భారీ వర్షాలకు పొంగిపొర్లిన వంక!

- సదాశివ కాలనీలోకి వర్షపు నీరు
- అవస్థలు పడ్డ స్థానికులు
- ఎమ్మెల్యే దృష్టికి వరద సమస్య
- రూ. 30 లక్షలతో కల్వర్టులు, రోడ్ల నిర్మాణం
- ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ

అనంతపురం, మహానాడు:
అనంతపురం రూరల్ మండలంలో వరద నీటితో వస్తున్న ఇబ్బందులనుంచి కాలనీల వాసులను కాపాడుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ ఇచ్చారు. అక్కంపల్లి పంచాయతీ సదాశివ కాలనీలోని వంక రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొంగిపొర్లింది. కాలనీలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అటు వైపు నుంచి ఇటు వైపు రాకపోకలు రెండు రోజులుగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సునీత బుధవారం పంచాయ రాతీ రాజ్ ఇతర విభాగాల అధికారులతో కలిసి కాలనీకి వెళ్లారు. వంక నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. స్థానికంగా కాలనీ వాసులు వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. అటు వైపునకు వెళ్లే మార్గం లేక రెండు రోజులుగా పిల్లలు పాఠశాలకు కూడా వెళ్లడం లేదన్నారు. అధికారులతో కలిసి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ కాలనీ వరద నీటికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే రూ. 30 లక్షలు నిధులు తీసుకొచ్చి ఇక్కడ పనులు చేపడుతామన్నారు. అందుకు ప్రణాళికలు తయారు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ముందుగా 20 లక్షలతో అధిక ప్రవాహం ఉన్న ఒక కల్వర్టు, 10లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఈ సమస్య తీవ్రంగా కనిపించినా.. హామీలు తప్ప.. నిధులు ఇవ్వలేదని విమర్శించారు. వచ్చే వర్షాకాలంలోపు ఈ సమస్య లేకుండా చేస్తామని ఈసందర్భంగా సునీత అన్నారు.

# విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మహానాడు:
కూటమి ప్రభుత్వం విద్య అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

ముండ్లమూరు మండలం పోలవరంలో మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఒకటి ప్రథమ చికిత్స కిట్లుని పోలవరం గ్రామ మాజీ సర్పంచ్ మలపాటి మల్లికార్జున మనవడు అతర్య సూర్య ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేసి, మాట్లాడారు. విద్యను ప్రోత్సహించేందుకే తల్లికి వందనం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15, 000 చొప్పున ఇస్తున్నట్టు యువ నేత, ఐటీ శాఖ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి తల్లిదండ్రుకి భరోసా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రజా ప్రభుత్వంలో 60 రోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ముందుకు వెళుతుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టర్ వద్దు, ఉచిత ఇసుక పాలసీ, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా నూతన పరిశ్రమల ఆవిష్కరణ, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం ప్రాజెక్టు పూర్తి, మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా అడుగులు వేస్తోందన్నారు. అదేవిధంగా దర్శి నియోజకవర్గంలో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్టు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని ఆమె వివరించారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి సహకారంతో జిల్లా మంత్రి బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అభివృద్ధి ప్రాంతంగా మార్చేందుకు ప్రణాళిక బద్దంగా ముందుకు వెళుతున్నామన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి, మంచినీరు, సాగునీటికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# వైద్య పరిశోధనలకు రేగుల స్వతంత్ర భారతి మృతదేహం

- చివరి కోరిక మేరకు కాటూరు మెడికల్ కళాశాలకు అప్పగింత



విజయవాడ, మహానాడు:
మృతి అందరిదీ. కాని స్మృతి కొందరికే దక్కుతుంది. ఆ కోవకే చెందుతారు రేగుల స్వతంత్ర భారతి. మరణానంతరం కూడా తాను ఈ సమాజానికి ఏదో రూపంలో ఉపయోగపడాలని భావించారు. హిందూ సాంప్రదాయాలకు భిన్నంగా గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తన మృతి అనంతరం పార్థీవ దేహానికి కర్మకాండలు వద్దని తన కుటుంబ సభ్యులను ఒప్పించి ముందుగానే దానిని వైద్య విద్యార్థుల ప్రాక్టికల్స్ నిమిత్తం అప్పగించేలా అంగీకార పత్రం సిద్ధం చేశారు. వయోభారం ఫలితంగా మంగళవారం రాత్రి స్వతంత్ర భారతి విజయవాడలో చనిపోగా ఆమె చివరి కోరిక మేరకు బుధవారం మృత దేహన్ని కాటూరి మెడికల్ కళాశాలకు అప్పగించారు.

కొత్తగూడెం సింగరేణి కాలరీస్‌లో ప్రెస్ ఆపరేటర్‌గా ఉద్యోగం నిర్వహించిన ఆమె పదవీ విరమణ అనం తరం కూడా అక్కడే ఉంటూ వచ్చారు. గత ఆరునెలల క్రితం ఆరోగ్యం సహకరించకపోవటంతో విజయవాడ లోని తన తమ్ముడు రేగుల సతీష్, జయశ్రీ కుటుం బంతో ఉంటున్నారు. భారతికి పిల్లలు లేకపోవటంతో సోదరుని కుటుంబమే అన్ని అయి వృద్ధాప్యంలో అండగా ఉంటూ వచ్చారు.

1947 ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున జన్మించిన ఆమెకు వారి తల్లిదండ్రులు స్వతంత్ర భారతి పేరిట నామకరణం చేశారు. పేరుకు తగ్గట్టుగానే వ్యవహరిస్తూ, కమ్యూనిస్టు భావజాలంతో గడిపుతూ వచ్చిన ఆమె ఈ నిర్ణయంతో మరణించి పరోక్షంగా జీవించే ఉన్నారు. భారతి దేహాన్ని అనాటమీ (శరీర నిర్మాణ శాస్త్రం) విభాగం తమ పరిశోధనలకు వినియోగిస్తుందని కాటూరి మెడికల్ కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఎల్‌వి ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ మృతి అనంతరం సకాలంలో నేత్రాలను స్వీకరించింది. కాటూరు మెడికల్ కళాశాల నుండి వచ్చిన బృందానికి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో దేహాన్ని అప్పగించారు.

# ఫేస్‌బుక్ పరిచయంతో పెళ్లి, అనుమానాస్పద మృతి!

- భర్త వసీం అక్రమ్, కుటుంబ సభ్యులే నిందితులని బాధితుల ఫిర్యాదు

అన్నమయ్య జిల్లా, మహానాడు:
ఫేస్‌బుక్ పరిచయం.. పెళ్లిదాకా తీసుకెళ్ళింది.. కానీ.. భర్త, అతని కుటుంబసభ్యుల తీరుతో ఓ మహిళ జీవితం అర్ధాంతరంగా ముగిసింది. ఈ విషాదకర ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా పీలేరులో చోటుచేసుకుంది. బాధితురాలు అర్షియ అత్తారింట్లో జరుగుతున్న గొడవలు, వేధింపుల విషయంపై మాట్లాడేందుకు రెండ్రోజుల క్రితం పీలేరులోనీ పుట్టింటికి వచ్చింది. ఆ తర్వాత తిరిగి సాయంత్రమే వాల్మీకిపురంలోని అత్తవారింటికి చేరుకుంది.

ఇంటికి వచ్చిన గంటలోపే అర్షియ సెల్‌ఫోన్ ఆఫ్ అయింది. ఈలోపే అర్షియ ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం పీలేరులో ఉన్న తల్లిదండ్రులకు అందింది. ఉరి వేసుకుని మృతి చెందిందని.. వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో డెడ్ బాడీ ఉందని చెప్పడంతో అర్షియ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఉదయం ఇంటికి వచ్చి కష్టాలు, బాధలు చెప్పుకున్న కూతురు



సాయంత్రానికి శవంగా మారడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అర్షియను అత్తారింటి వారే హత మార్చారని, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్షియ తల్లిదండ్రులు. భర్త వసీం, అత్తామామలే అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసి హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.

అర్షియ మృతిని అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటిని పరిశీలించిన పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అర్షియా అత్తామామలను అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. ఫేస్బుక్ పరిచయం పెళ్లి వరకు వెళ్లినా.. వసీం అక్రమ్.. అతని కుటుంబ సభ్యుల తీరుతో అర్షియా జీవితం ఇలా ఏడాదిన్నరలోపే అర్ధాంతరంగా ముగిసి పోయిందని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.



# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

ముంబయి: బంగారం ధరలు మళ్ళీ పెరిగాయి. ఈ మధ్యకాలంలో బంగారం రేట్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. తాజాగా బంగారం రేట్లు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్లో బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి రూ.550 పెరిగి రూ.73,200కి చేరింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.500 పెరిగి రూ.67,100 పలుకుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.67,250 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.73,350 వద్ద కొనసాగుతోంది. 18 క్యారెట్ల తులం ధర రూ.53,800గా ఉంది.

# రోడ్డుపై పెట్రోల్... తప్పిన పెను ప్రమాదం!

కళ్యాణదుర్గం, మహానాడు:



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలో పెను ప్రమాదం తప్పింది. ఓ వ్యక్తి క్యాన్లో పెట్రోల్ కొట్టించుకుని వెళ్తుండగా ఓ దుకాణం ఎదురు రోడ్డుపై క్యాన్ కిందపడి పగిలింది. రోడ్డుపై పెట్రోల్ పడి ఉన్నా గమనించని మరో వ్యక్తి బీడీ వెలిగించి అగ్గిపుల్ల పడేయటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పక్కనున్న బైక్లకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు సత్వరమే స్పందించి మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది.

# అభివృద్ధికి కేరాఫ్‌గా పేటను మారుస్తా...

- ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట, మహానాడు: నరసరావుపేట నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా మార్చి చూపించి తీరుతానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను



పర్యవేక్షించారు. ప్రధానంగా గత పాలకులు శ్మశాన వాటికల అభివృద్ధినిసైతం గాలికి వదిలేశారని, వాటిని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గతంలో కోడెల శివప్రసాదరావు ఉన్నపుడు ఎంత సుందరంగా ఉండేదో అంతకు మించి శుభ్రంగా తయారు చేసి కోడెలకు అంకితం ఇస్తానన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసింది... సంక్షేమాన్ని నాశనం చేసింది. కానీ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అన్ని పార్టీల నాయకులు కూడా సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి




తాడేపల్లి, మహానాడు:
మంగళగిరి ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.తారక రామారావు మృతి చెందారు. గుంటూరు విజయవాడ రహదారిలో కనకదుర్గ వారధి మీద 47వ పిల్లర్ దగ్గర బుధవారం లారీ వెనుక నుండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడురు. కేసు దర్యాప్తులో ఉంది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 22, ఆగస్టు 2024

## జరిగింది రుణమాఫీ కాదు.. పెట్టింది రైతులకు టోపీ

**హైదరాబాద్,మహానాడు:**

అధికారంలోకి వచ్చిన రోజే రూ. 2 లక్షల రుణమాఫీ అంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. ఇప్పటికైనా మేము రుణమాఫీ చేయలేకపోయాం. మా వల్ల కాలేదని చెబుతారని అనుకున్నాం. రుణమాఫీ బూటకం, పచ్చి దగా, పచ్చి మోసం. రవ్వంత రుణమాఫీ చేసి కొండంత డబ్బా కొట్టుకున్న ముఖ్యమంత్రి బండారం 70 లక్షల మంది రైతుల సాక్షిగా బట్టబయలైంది.

వ్యవసాయ శాఖ మంత్రి ఏమో రూ. 2 లక్షలు మాఫీ చేశాం అంటూ ప్రకటన చేశారు. కానీ కొన్ని పత్రికలు రుణం పూర్తిగా మాఫీ కాలేదంటూ వార్తలు రాశాయి. జరిగింది రుణమాఫీ కాదు పెట్టింది రైతులకు టోపీ. ఎక్కడికక్కడ తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నారు.

బ్యాంకులను ముట్టడిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.రైతులకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెప్పుకుంది.కానీ జరిగింది మోసం. రుణమాఫీ జరగలేదు. మాకెందుకు రుణమాఫీ జరగలేదని రైతుల రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తున్నారు. రుణమాఫీ కాలేదు కనుక రాష్ట్ర వ్యాప్తంగా రణరంగంగా మారిన పరిస్థితి. ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు మండలం లో బజార్ హత్నూర్ లో రైతుల పై కేసులు పెట్టి వేధిస్తున్నారు.

ఏ పార్టీ ప్రేరేపించకుండా రైతులు ఆందోళన చేస్తున్నారు. రుణమాఫీ జరగలేదని ఆందోళన చేస్తే రైతులకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష పడేలా కేసులు పెట్టి వేధిస్తుంది ఈ ప్రభుత్వం. రైతుల మీద నాన్ బెయిలబుల్ కేసులు పెడుతుంది. రెండు లక్షల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి చెప్తున్నారు. కానీ వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం ఇంకా రుణమాఫీ కావాల్సి ఉందంటాడు.

ముఖ్యమంత్రికి మంత్రులకు అసలు సయోధ్య లేదు. మనిషికి ఒక్క మాట మాట్లాడుతున్నారు. రుణమాఫీ వట్టిదే అని మంత్రుల మాటలతో తేలిపోయింది. సాంకేతిక అంశాల ఆధారంగా రుణమాఫీ జరగలేదని ఉత్తంకుమార్ రెడ్డి చెప్తున్నారు. సాంకేతిక కారణాలు ఏమీ లేవు. రుణమాఫీ ఎగ్గొట్టేందుకే ఇలా కారణాలు చెబుతున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు రకరకాలుగా మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించిన కేటీఆర్. రుణమాఫీ చేసింది పావు శాతం. కానీ రైతులను వంద శాతం మోసం చేశారు.

ఈ మూర్ఖున్ని క్షమించమని తెలంగాణ తల్లిని వేడుకోవాలని కోరుతున్నా. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 12,000 కోట్లు ఇంకా ఇవ్వాల్సి ఉందంటున్నారు. ఏడున్నర వేల కోట్లు మాత్రమే రైతుల ఖాతాలకు చేరిందని మీ ఉపముఖ్యమంత్రే చెబుతున్నారు. అసలు ఈ ప్రభుత్వానికి రుణమాఫీ పైన స్పష్టత ఉందా? లేదా? రైతులకు ఇచ్చింది ఎంతో కనీసం ప్రభుత్వానికి, మంత్రులకు తెలుసా? లేదా?

రైతు స్వరాజ్యమంటూ కాంగ్రెస్ పెద్ద ఎత్తున చేసుకున్న ప్రచారం నిజం కాదు. రైతు రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు అదే రైతులను ఏడిపిస్తూ మోసం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసానికి నిరసనగా రేపు రైతులు ధర్నా చేస్తున్నారు. కాంగ్రెస్ డ్రామాలు ఇక నడవవు. రుణమాఫీ పూర్తిగా ఎప్పుడు చేస్తారో చెప్పాలి.

రుణమాఫీ విషయంలో ఈ ప్రభుత్వానికి క్లారిటీ ఉందా? మొత్తంగా వీళ్లందరి మాటలు వింటే జరిగింది పావు శాతం రుణమాఫీ కూడా లేదని తేలిపోయింది. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయమన్నందుకు ముఖ్యమంత్రి మాట్లాడిన బజారు భాషకు వ్యతిరేకంగా, తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసి రేపటి ధర్నాను ప్రారంభించాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి. రుణమాఫీ పైన కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఇక నడవవు. బీఆర్ఎస్ పార్టీ రైతుల వెంట ఉన్నంతసేపు రైతులను మీరు మోసం చేయలేరు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎప్పటిలోగా మీరు రుణ మాఫీ చేస్తారో ఈ ప్రభుత్వం చెప్పాలి

మేము గతంలో రుణమాఫీ చేసినప్పుడు, రైతుబంధు వేసినప్పుడు ఎలాంటి ఆంక్షలు పెట్టలేదు. కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్య లు పెద్ద ఎత్తున తగ్గినయ్. కేసీఆర్ వ్యవసాయ స్థిరీకరణ కోసం ఎరువులు ఇచ్చినం, పెట్టుబడి సాయం, కరెంటు ఉచితంగా ఇచ్చారు. పన్నులు కూడా రద్దు చేసి రైతుకు అన్ని రంగాల్లో కేసీఆర్ అండగా నిలబడ్డారు. అందుకే పంజాబ్ లాంటి రాష్ట్రాలను తలదన్ని వ్యవసాయ రంగంలో తెలంగాణ అగ్రగ్రామిగా నిలిచింది.కానీ మీరు వచ్చిన తర్వాత వ్యవసాయంగానికి రైతాంగానికి అన్ని రకాలుగా నష్టం చేస్తున్నారు.

రైతు రుణమాఫీకి సంబంధించి క్షేత్రస్థాయిలో మేము కూడా పరిశీలన చేశాం.ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్ నుంచి సమాచారం తెప్పించుకున్నా. కొడంగల్ లోని కోస్గి మండలంలో ఐదు బ్యాంకుల్లో 20, 239 బ్యాంకు అకౌంట్ లోని రైతులకు గాను కేవలం 8, 527 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. ముఖ్యమంత్రి చెప్పిన మాటలు అన్ని మోసాలేనని ఇక్కడే అర్థమవుతుంది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో రైతులకు జరిగిన మోసం ఇది.వీళ్ళందరి డొల్ల మాటలు వింటే రైతు రుణమాఫీ జరిగింది పావు శాతం. రైతులకు మోసం మాత్రం 100 శాతం జరిగింది. ఇదే కథ ప్రతి ఊరిలో, ప్రతి గ్రామంలో ఉంది.

రుణమాఫీలో పాస్ బుక్‌లో పేర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను దాఖలు చేయటం, రేషన్ కార్డు వంటి కారణాలు చెప్పి అనేక కుంటి సాకులు చెబుతూ ఈ ప్రభుత్వం ఆంక్షలు పెడుతోంది. రుణమాఫీకే ఇన్ని సాకులు చెబుతున్న ప్రభుత్వం రైతుబంధుకు ఇంకా ఎన్ని ఆంక్షలు పెడుతారో? ఇది మోసకారుల ప్రభుత్వము. దగా ప్రభుత్వం. 49,500 కోట్ల రూపాయల తో మొదలైన రుణమాఫీ ప్రక్రియ ఈ రోజు 7, 500 కోట్లకు చేరింది. 7, 500 కోట్ల సాయంతోనే రుణమాఫీని ముగించే కుట్ర ఈ ప్రభుత్వం చేస్తోంది.

డిసెంబర్‌లో 49 వేల కోట్లు, జనవరిలో 40,000 కోట్లు.. జులై వచ్చేసరికి రూ. 31 వేల కోట్లు చేరింది.బడ్జెట్ కి వచ్చే సరికి 26 వేల కోట్లు... చివరికి 17 వేల కోట్లు అని చెప్పి... ఇప్పుడు 7, 500 కోట్లు మాత్రమే రైతులకు అందించారు. ఈ కోతల రాయుడు ప్రభుత్వాన్ని ఎండగడతాం. లక్షలాదిమంది రైతులను మోసం చేసిన ప్రభుత్వం పైన చీటింగ్ కేసు నమోదు చేయాలి. 70 లక్షల మంది రైతులను మాయమాటలతో మభ్యపెట్టి తడి గుడ్డతో రేవంత్ రెడ్డి గొంతు కోస్తున్నాడు.

వంద శాతం రుణమాఫీ చేసి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎందుకు ఆందోళన చేస్తున్నారు.రైతులు ఆందోళనలో పక్కదారి పట్టించేందుకే ఈ సీఎం చిల్లరగా అటెన్షన్ డైవర్షన్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కానీ మేము అటెన్షన్ డైవర్షన్ ను పట్టించుకోం. రైతుల కోసమే పోరాటం చేస్తాం.రైతులకు, వ్యవసాయ రంగానికి ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి తుంగలో తొక్కిండు. ఈ రైతు ద్రోహి ప్రభుత్వాన్ని వదిలిపెట్టకుండా వెంటాడుతాం, వేటాడుతాం. అందుకే రేపటి నుంచి మొదటి అడుగు రైతు ధర్నాతో ప్రారంభిస్తాం.

కేవలం మీడియాను, హెడ్ లైన్స్ ను మేనేజ్ చేసి రైతు రుణమాఫీ నుంచి దృష్టి మరల్చాలని చూస్తున్నారు. డెడ్ లైన్లు, హెడ్డ్ లైన్లు మార్చుకుంటూ రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. రైతు రుణమాఫీ చేయలేని సన్నాసులమని ఈ ప్రభుత్వం ఒప్పుకోవాలి.రైతుల పైన కేసు పెట్టటం మంచి పద్దతి కాదు. వెంటనే కేసులను ఉపసంహరించుకోవాలి. రైతులపై కేసులు మానుకోకుంటే జైలు భరో కార్యక్రమానికి కూడా పిలుపు ఇస్తాం. లక్షలాది మంది రైతులు, మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెడతారా? ఈ దగాకోరు సర్కార్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. తప్పకుండా రుణమాఫీ జరిగేదాకా కాంగ్రెస్ పార్టీని మేము వెంటాడుతాం. రైతులకు రేవంత్ రెడ్డి చేసిన చీటింగ్ పైన బీఆర్ఎస్ పార్టీ ఫైటింగ్ ఆగదు.

నేను అక్రమంగా ఏదైనా తప్పు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకోండి. బఫర్ జోన్ లో ఎవరి నిర్మాణాలు ఉన్న సరే కూల్చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. తప్పు నేను చేసిన సరే.. నాపై చర్యలు తీసుకోండి. నాకు ఫామ్ హౌస్ లేదు. నా ఫ్రెండ్ ఫామ్ హౌస్‌ను లీజు తీసుకున్నాను. ఒకవేళ ఆ ఫామ్ హౌస్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చేయండి. అదే విధంగా మంత్రులు, కాంగ్రెస్ నాయకుల నిర్మాణాలు కూడా కూల్చేయాలి. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల రాజభవనాలు కూడా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నాయి. వాటిని క్షూడా కూల్చేయాలి.

## ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూ సేకరణ

(మొదటిపేజీ తరువాయి..)

భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి–ఆమన్‌గల్–షాద్ నగర్–చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి... సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు.

సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.ఓ

## పోలీసింగ్‌లో స్పష్టమైన మార్పు కనిపించాలి

(మొదటిపేజీ తరువాయి..)

హెూం శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారాకా తిరుమల రావుతో పాటు పోలీసు శాఖలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### గత ప్రభుత్వంలో 46 శాతం పెరిగిన నేరాలు

సచివాలయంలో జరిగిన ఈ సమీక్షలో గత పదేళ్లలో పోలీసు శాఖలో నెలకొన్న పరిస్థితులపై అధికారులు వివరించారు. 2014-19 పోల్చితే 2019-24లో క్రైం రేట్ 46 శాతం పెరిగిందని అధికారులు వివరించారు. 2014-19 తో పోల్చుకుంటే 2019-23 మధ్యకాలంలో మహిళలపై నేరాలు 35.91 శాతం, మహిళల అదృశ్యం కేసులు 84.83 శాతం, సైబర్ నేరాలు 134.43 శాతం పెరిగాయని తెలిపారు. అలాగే గంజాయి, డ్రగ్స్ కేసులు 107.89 శాతం, చిన్న పిల్లలపై నేరాలు 151.88 శాతం పెరిగాయని వెల్లడించారు. గత ప్రభుత్వ తీరుతో పోలీసు శాఖ ఎలా నిర్వీర్యమైందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీసు శాఖలో ఆయా విభాగాలకు ఇవ్వాల్సిన చిన్న చిన్న ఆర్థిక మొత్తాలను కూడా చెల్లించకపోవడం వల్ల పోలీసులు, పోలీసు శాఖ ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

### పరికరాల ఏఎంసీకి దిక్కులేదు....కాలం చెల్లిన వాహనాలు

పోలీసు శాఖ వద్ద 143 డ్రోన్లు ఉంటే అందులో 88 పనిచేస్తున్నాయని తెలిపారు. బాడీ వోర్న్ కెమేరాలు 1250 ఉంటే 444 మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంలో 1180 కెమేరాలకు గాను కేవలం 317 మాత్రమే పనిచేస్తున్నాయని, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 14,712 సీసీ కెమేరాల్లో 2371 కెమేరాలు పనిచేయడం లేదని వివరించారు. ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం కూడా పనిచేయడం లేదని తెలిపారు. వీటన్నింటినీ తిరిగి వాడుకలోకి తెచ్చేందుకు అవసరమైన రూ. 30 కోట్లు నిధులు కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

యాన్యువల్ మెయింటనెన్స్ ఛార్జీలు చెల్లించకపోవడం వల్ల చాలా సేవలు అందుబాటులో లేకాండా పోయాయని.... వీటి వల్ల నేర విచారణలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. పోలీసు విభాగంలో 2014-19 మధ్య 5215 వాహనాల కొనుగోలుకు రూ.221.8 కోట్లు ఖర్చు చేస్తే వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.67.3 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కాలం చెల్లిన వాహనాలతో పోలీసు శాఖ ఇబ్బంది పడుతోందని...ప్రస్తుతం 2812 వాహనాల కోసం రూ.281 కోట్లు బడ్జెట్ అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### నిధులు విడుదలకు సీఎం అంగీకారం

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ పోలీసు శాఖను మళ్లీ గాడిలో పెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా వ్యవస్థల్లో పరికరాల నిర్వహణ ఖర్చులకు ఎప్పటి నుంచో పెండింగులో ఉన్న రూ.10 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా సీసీ కెమేరాల ఏర్పాటులో పెండింగులో ఉన్న రూ.11 కోట్ల బిల్లులు కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పోలీస్ శాఖను ఆధునికీకరించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వాటాగా రూ.61 కోట్లు విడుదల చేయడానికి కూడా సీఎం ఆమోదం తెలిపారు.

గత ప్రభుత్వం పోలీసులను కక్ష సాధింపులకు, ప్రజల, రాజకీయ పార్టీల అణిచివేతకు ఉపయోగించుకుంది కానీ.....పోలీసు శాఖ సామర్థ్యం మాత్రం పెంచేలేదని అన్నారు. నేర పరిశోధనలో కీలకమైన ఫింగర్ ప్రింట్ వంటి విభాగాలకు, పరికరాలకు కనీసం రూ.10 కోట్లు యాన్యువల్ మెయింటనెన్స్ చార్జెస్ చెల్లించకపోవడంపై ముఖ్యమంత్రి విస్మయం వ్యక్తం చేశారు. పోలీసు శాఖను మళ్లీ గాడిన పెడతామని.....రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి కింద పనిచేసే ఎస్ఐ వరకు మార్పు కనిపించాలని సీఎం స్పష్టం చేశారు.

మహిళలపై హింస విషయంలో చాలా కఠినంగా ఉండాలి. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అనేది నేరస్తులకు అర్థం కావాలి అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో గంజాయి సాగు, సరఫరా, వాడకం విపరీతంగా పెరిగిందని.. డ్రోన్స్ ను వినియోగించి గంజాయి పంట ఎక్కడ ఉందో గుర్తించి నాశనం చేయాలని అన్నారు. రాష్ట్రంలో, గంజాయి డ్రగ్స్ అనే మాట వినిపించకూడదని అన్నారు. గంజాయి లేని రాష్ట్రం కోసం ఉత్పత్తి, సరఫరా, వాడకం మధ్య ఉన్న చైన్ తెంచడం ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెలలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీలు చేద్దామని...ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానని సీఎం అన్నారు.

గంజాయి విషయంలో ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరముందని సీఎం అన్నారు. నేరాల విచారణ విషయంలో అసలత్వాన్ని, ఆలస్యాన్ని సహించేది లేదని......నేరం జరిగిన వెంటనే క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందాలు ఎందుకు వెళ్లడం లేదని సీఎం ప్రశ్నించారు. ఇకపై ఈ పరిస్థితి మారాలన్నారు. నేరం జరిగిన చోట వేగంగా పోలీసులు స్పందిచకపోతే...తానే స్వయంగా కొన్ని ఘటనలకు వెళ్లి విచారణను పర్యవేక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. సైబర్ క్రైం ను ఎదుర్కోవడానికి నిపుణులతో చర్చించాలని...అవసరమైతే కొత్త చట్టాలు కూడా తీసుకొద్దామని చెప్పారు. ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్ స్టేషన్ పెట్టాలని సిఎం అన్నారు.

ఇన్వెస్టిగేషన్ చార్జెస్ కింద కొంత మెత్తం విచారణ అధికారుల కు ఇచ్చే విధానాన్ని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారభించారని.... ఇప్పుడు దాన్ని మళ్లీ పునరుద్దరించాలని అధికారులు కోరగా దానికి సీఎం అంగీకరించారు. వీటితో పాటు గ్రేహౌండ్స్ సెంటర్, ఏపి పోలీసు అకాడమీ, ఏపి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ పోర్స్ సెంటర్, ఎపి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు స్థితిగతులను అధికారులు వివరించారు. కేంద్ర నుంచి వీటికి రావాల్సిన నిధులు తెచ్చుకుని వెంటనే పనులు మొదలు పెట్టాలని సీఎం అదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో విషయంలో ఏం చర్యలు తీసుకుంటున్నారు అనే ప్రణాళికతో రావాలని సీఎం ఆదేశించారు. వాహనాల ఫిట్నెస్ విషయంలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ విషయంలో వాహన దారులను వేధించినట్లు కాకుండా....ప్రజల రక్షణ కు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అయ్యేవారిని వదిలిపెట్టవద్దని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగా ఉండాలని సీఎం అధికారులకు దిశానిర్ధేశం చేశారు.

### విపత్తు నిర్వహణ శాఖనూ నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

విపత్తు నిర్వహణ సంస్థ కు తన వాటాగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 25 శాతం నిధులు ఇవ్వక పోగా....కేంద్ర నుంచి వచ్చిన నిధులనూ డైవర్ట్ చేశారని అధికారులు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ఒక రకంగా నేరం అని ఆయన వ్యాఖ్యానించారు. భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే సందర్భాల్లో ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ పనితీరును అధికారులు సీఎంకు వివరించారు. నాటి తెలుగు దేశం హయాంలో ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో విపత్తులు వచ్చిన సమయంలో వెంటనే సంబంధిత శాఖలు సమన్వయంతో కేంద్రానికి నివేదికలు ఇవ్వాలని...తద్వారా కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ప్రజలకు సాయం చెయ్యవచ్చని సీఎం అన్నారు.

## భక్తుల ఆరోగ్య భద్రత టిటిడి ప్రథమ కర్తవ్యం

- హెూటల్ యజమానులకు ఫాస్టాక్ (ఎఫ్ఓఎస్ టిఏసి) శిక్షణ
- టీటీడీ అదనపు ఈవో



**మంగళగిరి,మహానాడు:** తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకర మైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతోపాటు వారి ఆరోగ్య భద్రతే టిటిడి అత్యంత ప్రాధాన్యత అని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు.

టిటిడి ఈవో జె.శ్యామలరావు ఆదేశాల మేరకు టిటిడి ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమల లోని హెూటళ్ల నిర్వాహకులకు, యజమానులకు తిరుమల లోని శ్రీవారి సేవా సదన్ సత్సంగం హాల్లో బుధవారం నాడు జరిగిన శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో ప్రసంగిస్తూ, అన్ని రకాల తినుబండారాలు ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే వేలాది మంది భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం హెూటళ్ళను నిర్వహించాలన్నారు. హెూటళ్ల లోపల పరిశుభ్రత, ఆహార పదార్థాలు నిల్వ చేయడం, వడ్డించడం వంటి విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించి క్రమబద్ధీకరించడం, తదితర విషయాలను నిశితంగా పరిశీలించాలని ఆయన హెూటళ్ల వారికి చెప్పారు.

తరువాత న్యూ ఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్–ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ సిహెచ్ ఆంజనేయులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అన్ని రెస్టారెంట్‌లు మరియు తినుబండారాలలో అనుసరించాల్సిన పరిశుభ్రత మరియు పారిశుద్ధ్య పద్ధతులు, ఆహారం చెడిపోవడం వల్ల కలిగే భౌతిక–రసాయన–జీవ ప్రమాదాలు, వృధా వంటి వాటి గురించి వివరించారు, నిబంధనలను ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలు వంటి అనేక అంశాలను తెలియజేశారు.

టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీ ఈవో శ్రీమతి ఆశాజ్యోతి మాట్లాడుతూ, ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి తిరుమలలో హెూటళ్ల వ్యాపారులందరికీ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుమల హెల్త్ ఆఫీసర్ మధుసూధన్ రావు, తిరుపతి జిల్లా ఫుడ్ కంట్రోలర్ శ్రీ జి. వెంకటేశ్వరరావు, తిరుమల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్, తిరుమలలోని హెూటళ్ల వ్యాపారులు, టిటిడి అన్నప్రసాదం సిబ్బంది పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ యూనివర్సిటీపై లేఖ రాసినా స్పందన లేదు

### - బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి విమర్శ

**తెలంగాణ భవన్, మహానాడు:** రాష్ట్రంలో విద్యాశాఖ, క్రీడా శాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు... స్పోర్ట్స్ యూనివర్సిటీపై సీఎం ఆఫీసుకు లేఖ రాసినా స్పందన లేదని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం తెలంగాణ భవన్‌లో విలేఖర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే దోమలగూడలో వ్యాయామ విద్యా కళాశాలను స్పోర్ట్స్ యూనివర్సిటీ చేయాలని అనుకున్నాం... తొలి విడతగా పక్కా భవనాల కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీకి కేసీఆర్ 20 కోట్లు కేటాయించారు... క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటోంది... దోమలగూడలో ఉన్న వ్యాయామ విద్యా కళాశాలలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని నిర్మించాలి...




కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు జీవో వచ్చిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం దోమలగూడ వ్యాయమ విద్యా కళాశాలపై వివక్ష చూపవద్దు.. రాష్ట్రం మొత్తమ్మీద వ్యాయామ విద్యా కళాశాల ఉన్నది దోమలగూడలోనే... స్పోర్ట్స్ యూనివర్సిటీపై ప్రభుత్వం పెద్ద,పెద్ద మాటలు చెప్తోందన్నారు.


11

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ | గురువారం 22, ఆగస్టు 2024




## రీ రిలీజై రూ.10 కోట్లు కొల్లగొట్టిన 'మురారి'

సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 9న రీ రిలీజైన 'మురారి' రికార్డులు తిరగరాసింది. ఈ సినిమా విడుదలైన తొలిరోజే దాదాపు రూ.5 కోట్లకు పైగా వసూళ్లు అందుకుంది.

ఇక మొత్తంగా రూ.10 కోట్లు కలెక్ట్ చేసి సంచలనం సృష్టించింది. ఓవర్సీస్‌లో ఏకంగా $94.49K కలెక్షన్లు కొల్లగొట్టింది.

ఓ తెలుగు సినిమా రీ రిలీజ్‌కు ఈ రేంజ్‌లో కలెక్షన్లు రావడం ఇదే తొలిసారి. కృష్ణవంశీ దర్శకత్వం, మణిశర్మ సంగీతం ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.




## 'తెలుసు కదా' షూటింగ్‌లో జాయిన్ అయిన శ్రీనిధి శెట్టి

స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ న్యూ మూవీ 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో డైరెక్టర్ గా పరిచయమౌతున్నారు. రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లావిష్ గా నిర్మిస్తున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్‌లో సిద్దూ జొన్నలగడ్డ, రాశి ఖన్నాలపై టాకీతో పాటు సాంగ్ ని షూట్ చేశారు. తాజాగా కొత్త షెడ్యూల్ స్టార్ట్ అయ్యింది. ఈ కొత్త షెడ్యూల్ లో హీరోయిన్ శ్రీనిధి శెట్టి జాయిన్ అయ్యింది. ఈ షెడ్యూల్ లో చాలా కీలకమైన సన్నివేశాలని షూట్ చేస్తున్నారు.

నిర్మాత టిజి విశ్వప్రసాద్ ఈ సినిమాని హై బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. థమన్ ఎస్ సంగీతం అందించగా, జ్ఞాన శేఖర్ బాబా సినిమాటోగ్రఫీని హ్యాండిల్ చేస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ టెక్నీషియన్ నవీన్ నూలి ఎడిటర్. బిజీ ప్రొడక్షన్ డిజైనర్లలో ఒకరైన అవినాష్ కొల్లా ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్. శీతల్ శర్మ కాస్ట్యూమ్స్ డిజైన్ చేస్తున్నారు.

## నాదారి నాదే

స్టార్ హీరోయిన్ సమంత.. కొన్నేళ్ల క్రితం మయోసైటిస్ బారిన పడ్డ విషయం తెలిసిందే. యశోద మూవీ టైమ్ లో తాను మయోసైటిస్ వ్యాధి బారిన పడ్డట్టు ప్రకటించిన సామ్.. ఆ తర్వాత ట్రీట్మెంట్ తీసుకుంది. కాస్త గ్యాప్ తర్వాత అప్పటికే తన చేతిలో ఉన్న విజయ్ దేవరకొండ ఖుషీ మూవీతో పాటు సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ ను కంప్లీట్ చేసింది. బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ సరసన నటించిన ఆమె.. వెబ్ సిరీస్ షూటింగ్ లో ఆరోగ్యపరంగా బాగా ఇబ్బంది పడింది. ఆ తర్వాత మళ్లీ విదేశాలకు వెళ్లిన సామ్.. అక్కడ ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలింది. కొండలు కోనలు తిరిగి ప్రకృతిని ఆస్వాదించింది. కొన్ని రోజుల క్రితం ఇండియా వచ్చిన అమ్మడు... మళ్లీ సినిమాలు చేసేందుకు సిద్ధమైంది. త్వరలోనే సిటాడెల్ సిరీస్ తో సందడి చేయనుండగా.. తన సొంత బ్యానర్ పై మూవీ ప్రకటించింది. మరిన్ని ప్రాజెక్టులను లైన్ లో పెట్టేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆమె రెండో పెళ్లి గురించి కూడా జోరుగా ప్రచారం సాగుతోంది. నాగచైతన్య, సమంత కొన్నేళ్ల క్రితం గ్రాండ్‌గా పెళ్లి చేసుకోవడం.. ఆ తర్వాత విడాకులు తీసు కోవడం.. చై రీసెంట్‌గా హీరోయిన్ శోభితతో ఎంగేజ్మెంట్ చేసుకోవడం.. ఇవన్నీ తెలిసిందే. అదే సమయంలో సామ్ రెండో పెళ్లిపై కూడా వార్తలు వచ్చాయి. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ డైరెక్టర్ రాజ్ తో సామ్ ప్రేమలో ఉందని టాక్ వినిపించింది. ఆ సిరీస్ సెకండ్ సీజన్ లో ఆమె నటించింది. అప్పటి నుంచి వారిద్దరూ ప్రేమలో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే సమంత కానీ, రాజ్ కానీ రూమర్లపై రియాక్ట్ కాకపోవడం.. ప్రేమ విషయం నిజమేనని కొందరు అంటున్నారు. అదే సమయంలో సామ్ నిన్న పెట్టిన ఇన్ స్టా పోస్ట్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. సమ్ థింగ్ స్పెషల్



రాబోతోంది.. స్టే ట్యూన్డ్ అంటూ ఆమె పోస్ట్ పెట్టడంతో నెట్టింట జోరుగా చర్చ సాగింది. రాజ్ తో ఎంగేజ్మెంట్ డేట్ ను అనౌన్స్ చేస్తుందని చాలా మంది కామెంట్స్ పెట్టారు. ఫ్యాన్స్ మాత్రం.. మూవీ అప్డేట్ అయ్యి ఉంటుందని అంచనా వేశారు.

## 'సరిపోదా శనివారం'
## బ్లాక్ బస్టర్ కన్ఫర్మ్ : నేచురల్ స్టార్ నాని

నేచురల్ స్టార్ నాని, క్రియేటివ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో SJ సూర్య పవర్ ఫుల్ రోల్ ప్లే చేస్తున్నారు. ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో నిర్మిస్తున్నారు. ఈ అడ్రినలిన్ ఫిల్డ్ యాక్షన్-అడ్వెంచర్ ఇప్పటికే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఆగస్ట్ 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మూవీ యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మనం మధ్యలో ఒక ప్రామిస్, ఒక బాండ్ వుంది. ఈ బాండ్ ని ఇంకా ఇంకా బలపరిచే సినిమా 'సరిపోదా శనివారం' అవుతుంది. ఈసారి సినిమా హాళ్ళు కాన్సర్ట్ లా వుంటుంది. జేక్స్ బిజోయ్ చితకొట్టేస్తున్నాడు. ఎప్పుడెప్పుమీరు చూస్తారా అని ఎదురుచూస్తున్నాను. మీతో పాటు చూడటానికి ఎదురుచూస్తున్నాను. సుదర్శన్ 35 ఎంఎం కి మార్నింగ్ 11 షోకి వస్తున్నాను. కలసి సెలబ్రేట్ చేసుకుందాం. వివేక్ ఆ రోజే వస్తాడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో మునిగిపోయి వున్నాడు. దానయ్య గారు ఆర్ఆర్ఆర్ లాంటి సక్సెస్ చూసిన తర్వాత అంత తొందరగా ఏదీ ఆనదు.



కానీ ఇది ఆనుతుందనే నమ్మకం వుంది.(నవ్వుతూ) కళ్యాణ్ కి థాంక్స్. టీం అందరికీ పేరుపేరునా థాంక్స్. సినిమా కోసం చాలా కష్టపడుతున్నారు. వివేక్ రెండు నెలలుగా నిద్రపోయింది లేదు. ఆ కష్టం తెరపై కనిపిస్తుంది. ఈసారి వాళ్ళందరి కోసం ఈసారి సినిమా వేరే లెవల్ కి రీచ్ అవ్వాలని కోరుకుంటున్నాను.



## 'రుద్ర గరుడ పురాణం' తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది : సోహైల్

రిషి, ప్రియాంక కుమార్ జంటగా కేఎస్ నందీష్ దర్శకత్వంలో రూపొందుతోన్న కన్నడ చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. అశ్విని ఆర్ట్స్ బ్యానర్‌పై అశ్విన్ విజయ్ లోహిత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బైలింగ్విల్ మూవీగా తెరకెక్కించి నాలుగు భాషల్లో సినిమా రిలీజ్ చేస్తున్నారు. బుధవారం ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నిర్మాత మధుర శ్రీధర్ అశ్విన్ ఆర్ట్స్ బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, హీరో సోహైల్ తెలుగు టీజర్‌ను విడుదల చేశారు. హీరో సోహైల్ మాట్లాడుతూ.. 'కన్నడ మూవీని తెలుగులో కూడా రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఈ మూవీ టైటిల్‌తో పాటు టీజర్ చాలా బాగుంది. కొత్త కంటెంట్‌ను తెలుగు ఆడియెన్స్ ఎప్పుడూ ఆదరిస్తూనే ఉన్నారు. కేజీయఫ్, కాంతారా దగ్గర నుంచి రీసెంట్‌గా వచ్చిన లవ్ టుడే, మహారాజా, 777 ఛార్లీ, మంజుమ్మల్ బాయ్స్ లాంటి కంటెంట్ బేస్డ్ సినిమాలను తెలుగు ప్రేక్షకులుగా మేం హిట్ చేశాం. ఈ మూవీ టీజర్ చూశాక సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌లా అని పిస్తుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుంది. నందీశ్వర్ గారు చాలా బాగా తీశారు.

రిషి గారి హైట్, పర్సనాలిటీకి ఇది కరెక్ట్ సినిమా. నాలుగు భాషల్లో ఈ సినిమా సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నా' అంటూ ఆల్ ద బెస్ట్ చెప్పారు.

## 'ఉరుకు పటేల' నుంచి లిరికల్ సాంగ్

హుషారు వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తేజస్ కంచర్ల. తేజస్ చేస్తోన్న తాజా చిత్రం 'ఉరుకు పటేల'. 'గెట్ ఉరికిఫైడ్' సినిమా ట్యాగ్ లైన్. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మించారు. సెప్టెంబర్ 13న ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందించిన ఈ సినిమాకు ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూర్చారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, 'పట్నం పిల్లా..' అనే సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా 'ఉరుకు పటేల' సినిమా నుంచి 'ఓరి మాయలోడా..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ప్రముఖ హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా సాంగ్ విడుదలైంది. హీరో ప్రేమలో పడిన హీరోయిన్ తన మనసులోని ప్రేమను తెలియజేసే సందర్భంలో వచ్చే పాట ఇది. ప్రవీణ్ లక్కరాజు సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ చిత్రంలో 'ఓరి మాయలోడా..' పాటను స్ఫూర్తి జితేందర్ పాడగా, శ్రీనివాస మౌళి రాశారు. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144